ప్రజాశక్తి

మంగళవారం 22 జులై 2025 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

అర్జీదారులను కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దు

కలెక్టర్ వెంకటమురళి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

సమస్యల పరిష్కారం కోసం వచ్చే అర్జీదారులను ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పించుకోవడం మంచి పద్ధతి కాదని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం స్థానిక కలెక్టరేట్లో జరిగింది. 'మా సమస్యలు పరిష్కరించండి..' అంటూ జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారులు కలెక్టర్‌ను వేడుకున్నారు. 191 అర్జీలు నమోదయ్యాయి. తన పరిధిలోని వాటికి కలెక్టర్ తక్షణమే పరిష్కార మార్గం చూపారు. కొన్నింటిని ఆయా శాఖల అధికారులకు పురమాయిస్తూ ఆదేశాలు ఇచ్చారు. మిగిలిన వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.

ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ వ్యవస్థ పరిధిలోకి దస్త్రాలన్నింటినీ తీసుకురావాలని కలెక్టర్ చెప్పారు. ప్రస్తుతం ఉన్న దస్త్రాలు, గతంలో ఉన్న దస్త్రాలన్నింటినీ ఏఐలో ఉంచాలన్నారు. వారంలో ఒక లక్ష ఫైల్స్ అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. పి4 అమలు తీరుపై క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. పరిశీలనకు వెళ్లే సమయంలో గ్రామ కమిటీలకు ముందస్తుగా సమాచారం ఇవ్వాలన్నారు. అర్హులైన బంగారు కుటుంబాలు, మార్గదర్శిలు సరైన వారేనా, నీడ్ బేస్డ్ సర్వే సక్రమంగా జరుగుతుందా.. లేదా.. అనే అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. అనర్హులు ఉన్నట్లు గుర్తిస్తే వారిని తొలగించాలని ఆదేశించారు. పి4 విధానంలో సవరణ ప్రక్రియకు అధికారులు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. సూర్య ఘర్, స్వచ్ఛతాహి కార్యక్రమాలను పరిశీలించాలన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రభుత్వ ▶ 2లో

వ్యాపారాల్లో నిస్తేజం

- ప్రజల ఆదాయాలపై ప్రభావం
- ప్రభుత్వంపైనా పెరుగుతున్న ఆశలు
- ఎక్కడ పెట్టుబడి పెట్టాలన్నా వెంటాడుతున్న భయం



ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

అనేక వ్యాపారాల్లో నిస్తేజం కనిపిస్తోంది. కొనుగోళ్లు తగ్గాయని ఏ వ్యాపారిని కదిలించినా చెబుతున్నారు. కారణాలు అనేకం వినిపిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆర్థిక సం క్షోభం మనకు తెలియకుండానే కొన్ని కీలక రంగాలపై ప్రభావం చూపుతోంది. దాని వల్ల ఆర్థిక లావాదేవీలు సజావుగా లేనందున వ్యాపారాలపై ప్రతికూల ప్రభావం చూపు తోంది. నగదు చలామణి నిలిచిపోయింది. చేతిలో డబ్బులు కనిపించడం లేదు. దీంతో ప్రభుత్వం నుంచి ఏమైనా వస్తుందా? ఖాతాల్లో పడతాయా? పథకాల డబ్బులు ఎపుడు వస్తాయనే ఆశలతోనే ఉన్నారు. జీవన ప్రమాణాలపైనా ప్రభావం కనిపిస్తోంది.

మరో వైపు రాష్ట్ర ప్రభుత్వం కూడా పి-4 పేరుతో పేదలను అభివృద్ధి చేసేందుకు సంపన్నులు ముందుకు రావాలని కొత్త తరహా పిలుపునిచ్చింది. దీనికి ఆశించినంత స్పందన లేదు. కారణం సంపన్నులూ ఆచీతూచీ వ్యవహరిస్తున్నారు. ఆర్థిక సంక్షోభం, అమెరికాలో పరిస్థితులు సాఫ్ట్‌వేర్ రంగంపై తీవ్ర ప్రభావం చూపాయి. అమెరికాలో ఉద్యోగాలు చేస్తున్న యువత వల్ల కొన్ని కుటుంబాల్లో డాలర్‌ను రూపాయల్లోకి మార్చుకున్నారు. కొత్త ఇళ్లు కట్టుకొని గ్రామాల్లో వీరి సంఖ్య ప్రత్యేకంగా ఉంది. ఇప్పుడు అక్కడా పరిస్థితి బాగా లేదు. దీంతో దేశీయంగా ఉన్న సాఫ్ట్‌వేర్ రంగం కూడా తిరోగమనం వైపు నడుస్తోంది. చదువుకున్న ఇంజనీరింగ్ యువతకు ఉద్యోగాలు లేవు. దీంతో ఆ రంగం నుంచి డబ్బులు బాగా తగ్గాయి. దీంతో కొనుగోలు శక్తి తగ్గి వ్యాపారరంగాల పైనా ప్రభావం పడింది. నిర్మాణ రంగంపైనే ఎక్కువ ప్రభావం ఉంది. ఈ రంగంలో అనేక వ్యాపారాలు నడుస్తున్నాయి. వాటిల్లోనే ఇప్పుడు నిస్తేజం కనిపిస్తోంది. రియల్‌ఎస్టేట్ రంగం కూడా ఊపుగా లేదు. కొనుగోళ్లు బాగా తగ్గాయి. ఈ రంగంపై ఆధారపడ్డ వ్యవస్థలన్నీ ఇప్పుడు ఇబ్బందుల్లో ఉన్నాయి. బిల్డర్లు ఆశాజనకంగా కనిపించడం లేదు. నిర్మాణరంగంలోనూ అనుకూలత లేదు. ఇక వాణిజ్య పంటల విషయానికి వస్తే పొగాకు, శనగ, మిర్చి వంటి పంటలకు గిట్టుబాటు ధరల్లేవు. కారణం ప్రపంచవ్యాప్తంగా కొన్ని పంటలు పెరిగాయి. దిగుమతులు మనకు పెరిగాయి. నియంత్రణ లేదు. వ్యాపారులకు రైతులను వదిలేశారు. రొయ్యల ఎగుమతులు తగ్గాయి. మరో వైపు గ్రానైట్ ఎగుమతుల్లోనూ సానుకూలత లేదు. ఇవన్నీ ▶ 2లో



కనిగిరిలో అచ్యుతానందన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కామ్రేడ్ అచ్యుతానందన్ మృతి తీరని లోటు

8లో

స్మార్ట్‌మీటర్ల తిరస్కరణ

ప్రజల ఆందోళనతో వెనుదిరిగిన 'అదానీ' సిబ్బంది

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

నగరంలోని నండూరి ప్రసాదరావు నగర్‌లో స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. సోమవారం నాడు స్థానిక దామోదరం సంజీవయ్య కూరగాయల మార్కెట్ ఎదురుగా ఉన్న నండూరి ప్రసాదరావు కాలనీలో స్మార్ట్ మీటర్లు బిగించేందుకు వచ్చిన అదానీ సిబ్బందిని స్థానికులు నిలువరించారు. సిఐటియు నాయకులు పోకల కోటేశ్వరరావు, ఏ రామాంజనేయులు ఆధ్వర్యంలో స్థానికులు ఏకమై స్మార్ట్ మీటర్ల వల్ల వచ్చే భారం, సమస్యలను వివరించారు. తమ ఇళ్లకు స్మార్ట్ మీటర్లు వద్దని స్పష్టంగా చెప్పడంతో, అదానీ సిబ్బంది అక్కడినుంచి మీటర్లు తీసుకొని వెనుదిరిగారు.

నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం

- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్
- సబ్‌స్టేషన్ ప్రారంభం



సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రజలకు నాణ్యమైన విద్యుత్, రైతులకు 9 గంటల విద్యుత్ అందించడంతో పాటు విద్యుత్ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. ఒంగోలు నగర పరిధిలోని వెంకటేశ్వర కాలనీలో రూ.4.50 కోట్లతో నిర్మించిన సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవం కార్యక్రమం, ఒంగోలు నగరంలోని మంగమూరు రోడ్డు జంక్షన్‌లో రూ.11 కోట్లతో నిర్మించనున్న వివిధ విద్యుత్ పనులకు భూమి పూజ చేశారు. ఒంగోలు నగరంలోని భాగ్యనగర్లో రూ.4.50 కోట్లతో కొత్తగా నిర్మించనున్న సబ్ స్టేషన్ కు సోమవారం ఉదయం మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఒంగోలు, ఎస్ఎన్‌పాడు శాసన సభ్యులు దామచర్ల జన్నార్ధనరావు, బిఎన్. విజయ్‌కుమార్, కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియాలతో కలిసి ప్రారంభోత్సం, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ సబ్ స్టేషన్ల నిర్మాణంతో ప్రజలకు ఎంతో ఉపయోగకరమన్నారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో వోల్టేజ్ సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు.

ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధనరావు మాట్లాడుతూ సబ్ స్టేషన్ పూర్తయితే సమీపంలో ఉన్న ప్రాంతాలకు ఎంతో లబ్ధి చేకూరుతుందని చెప్పారు. నగరపరిధిలోని గ్రామాలకు నిరవధిక విద్యుత్ సరఫరా లభిస్తుందని, ఇది ప్రజలకు మరియు రైతులకు ఎంతగానో ఉపయోగమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఒంగోలు ఆర్డీవో లక్ష్మిప్రసన్న, ఏపీ సీపీడీసీఎల్ఎ ఎస్ఇ కట్టా వెంకటేశ్వర్లు, డి.ఈ హరిబాబు, విద్యుత్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



చెత్త వాహనాన్ని అడ్డగించిన మున్సిపల్ కార్మికులు

చెత్త వాహనం అడ్డగింత

కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి-చీమకుర్తి

మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు ఆరో రోజు కూడా సమ్మె కొనసాగించారు. సోమవారం మున్సిపల్ అధికారులు చెత్తను తరలిస్తున్న వాహనాన్ని కార్మికులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి పల్లాపల్లి ఆంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యల పట్ల మొండి వైఖరి వ్యవహరించకుండా, కార్మికుల డిమాండ్స్‌ను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పారిశుధ్య పనులను ప్రైవేటు సంస్థలకు అప్పగించరాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు పి ఏడుకొండలు, పి పద్మ, నాయకులు ఈ నాగయ్య, పిచ్చయ్య, నరసయ్య ఆంద్రీ, విజయమ్మ, అంకమరావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

అర్జీదారులను.. కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దు

(మొదటిపేజీ తరువాయి)

అధికారులు ప్రోటోకాల్ తప్పనిసరిగా పాటించాలన్నారు. రెండు రోజుల ముందుగానే ప్రజాప్రతినిధులకు ఆహ్వానం పంపాలన్నారు. ప్రోటోకాల్ అమలు తీరులో సమస్యలు ఉత్పన్నం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, ఆర్డీవో పి.గ్లోరియా, డిఆర్‌డిఎ పిడి శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

ఒరిగిన బస్సు..తప్పిన ప్రమాదం..

ప్రజాశక్తి- అర్ధవీడు : స్కూల్ బస్సుకు తృటిలో ప్రమాదం తప్పింది. ఈ ఘటన మండల పరిధిలోని కల్వానేశ్వర శివాలయం సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. కంభంలోని వాసవీ స్కూల్ బస్సు అచ్చంపేట సమీప గ్రామాల్లో విద్యార్థులను తీసుకొని అర్ధవీడు వస్తుంది. అదే సమయంలో ఎదురుగా వస్తున్న ఆర్‌టిసి బస్సుకు సైడ్ ఇచ్చే క్రమంలో స్కూల్ బస్సును డ్రైవర్ మార్జిన్‌లోకి దించాడు. అక్కడ గుంత ఉండటంలో బస్సు అందులోకి దిగి కూరుకుపోయి ఓ సైడ్‌కు ఒరిగింది. దీంతో బస్సు డ్రైవర్ అప్రమత్తగా వ్యవహరించి బస్సులోకి పిల్లలను కిందకు దించాడు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

వ్యాపారాల్లో నిస్తేజం

(మొదటిపేజీ తరువాయి)

జిల్లా ఆర్థిక పరిస్థితులపై ప్రభావం చూపాయి. వ్యాపారవర్గాలకు లాభాలు తగ్గాయి. ఆదాయాలు చూపిన రంగాల్లో సంక్షోభం తలెత్తడంలో మధ్యతరగతి వర్గాల ఆదాయాలు ఏదోరకంగా తగ్గాయి. ఇవన్నీ కొనుగోళ్లపై ప్రభావం చూపాయి. గ్రామాల్లోనూ ఇప్పుడు ఆర్థిక సంక్లిష్టత పెరిగింది. ఈ తరుణంలో కూటమి ప్రభుత్వం వచ్చాక సంక్షేమ ఎజెండా వేగంగా లేదనే చర్చ నడుస్తోంది. వైసిపి ప్రభుత్వంలో ఏదో ఒక పథకం కింద ఖాతాల్లో నగదు పడేవి. ఇప్పుడు ఆ ఒరవడి తగ్గిందనే చెప్పాలి. గ్యాస్ సిలిండర్లు మూడు ఉచితంగా ఇస్తున్నా వాటి ప్రభావం పెద్దగా లేదు. తల్లికి వందనం పథకం ఆశాజనకంగా ఉంది. పెన్షన్లు పెంచారు. పేదలకు గతంలో వచ్చేవి తగ్గడంతో కొనుగోళ్లు తగ్గాయి. ఇప్పుడు రిటైల్ వర్తకులకు వ్యాపారాలు తగ్గాయి. అదే సమయంలో మాల్స్ పెరిగాయి. వాటికే జనం వెళుతున్నారు. వ్యాపారవర్గాల్లోనూ ప్రభుత్వంపై చర్చ సాగుతోంది. ఖాతాల్లో పడేవి తగ్గడం వల్లనే తమకు వ్యాపారాలు తగ్గాయనే చర్చను తెరపైకి తెస్తున్నారు. ఇక అభివృద్ధి పనులు వేగంగా లేవు. నిధులు భారీగా కేటాయింపులు చేసిన పనులు ఏమీ జరగడం లేదు. దీంతో రాజకీయనేతలకూ ఆదాయాలు కనిపించడం లేదు. కాంట్రాక్టర్లు చేసిన పనులకు బిల్లులు రావడం లేదని ఆందోళన చెందుతున్నారు. గత ప్రభుత్వంలో చేసిన సచివాలయ వ్యవస్థల్లోని భవనాల తాలూకు పనులకే రూ.300 కోట్లకు పైగానే బిల్లులు రావాల్సి ఉంది. కొత్తగా జిల్లాలో విద్యుత్‌శాఖ పరిధిలో సబ్‌స్టేషన్లు మినహా మిగతా పనులు పెద్దగా లేవు. ఇలా ఆర్థిక పరిస్థితులు సంక్లిష్టం కావడానికి అనేక కారణాలు కనిపిస్తున్నాయి. ఇలాంటి సమయాల్లోనే పాలకులపై ఆశలు పెరుగుతాయి. అందరూ ప్రభుత్వం నుంచి ఏమి వస్తుందనే భావనతోనే ఉంటారు. ఇప్పుడు ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ప్రజల ఆకాంక్షలు పెరుగు తున్నాయి. ఆ దిశగా ఉద్దీపన చర్యలు కనిపించడం లేదు.

రోగులకు ఇబ్బంది లేకుండా చూడాలి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం : ఏరియా వైద్యశాలకు వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యశాల సూపరింటిండెంట్ డాక్టర్ దేవర యదిద్యా తెలిపారు. ఏరియా వైద్యశాలలోని వార్డులను సోమవారం పరిశీలించారు. రోగులలో మాట్లాడి వైద్యశాలతో అందుతున్న వైద్య చికిత్సలు, రోగుల పట్ల ఆసుపత్రి సిబ్బంది వ్యవహరిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం నర్సింగ్ సిబ్బందితో మాట్లాడారు. వైద్యశాలకు వచ్చే రోగులకు ఒపి రాయించే వద్ద నుంచి చికిత్సలు అందించే వరకూ దగ్గర ఉండి సేవలం దించాలన్నారు. వైద్యశాల అంటే దేవాలయం లాంటిదని, రోగులు ఇక్కడికి ఎంతో ఆశతో చికిత్స పొందేందుకు వస్తారని తెలిపారు. వారందరికీ చికిత్స అందించి సంతోషంగా ఇంటికి పంపాలన్నారు.

ముగ్గురు బాలికలను దత్తత తీసుకున్న ఎంఇఒ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

స్థానిక కేజీబీవీ పాఠశాలలో చదువుతున్న ముగ్గురు బాలికలను ఎంఇఒ ఆంజనేయులు దత్తత తీసుకున్నారు. పి4 కార్యక్రమంలో భాగంగా గంగుపల్లికి చెందిన హర్షిణి, యర్రగొండపాలెంకు చెందిన తేజస్విని, పాలుట్లకు చెందిన శివరంజని బాయి అనే విద్యార్థినులను ఎంఇఒ సోమవారం దతత్త తీసుకున్నారు. ఆ విద్యార్థినులు తల్లిదండ్రులు లేని అనాధలని పాఠశాల ప్రిన్సిపల్ ఎస్ తిరుమలాదేవి ఎంఇఒ ఆంజనేయులు దృష్టికి తీసుకెళ్లింది. దీంతో స్పందించిన ఎంఇఒ ఆ విద్యార్థినులు దత్తత తీసుకున్నారు. వారికి దుస్తులు, పండ్లు అందజేశారు. వారితో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ తోటి పిల్లలతో పోల్చుకుని బాధపడకూడదన్నారు. బాగా చదువుకుని అన్నింటా ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ప్రతి సంవత్సరం ముగ్గురు విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు తానే చూసుకుంటానన్నారు. ప్రతియేటా పుట్టినరోజు వేడుకలు నిర్వహించాలన్నారు. కెజీబీవీ ప్రిన్సిపాల్ ఎస్ తిరుమలాదేవి మాట్లాడుతూ తమ పాఠశాలలో చదువుతున్న ముగ్గురు అనాధలను దత్తతు తీసుకున్న ఎంఇఒ ఆంజనేయులుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కెజీబీవీ ఉపాధ్యాయులు సునంద, గురవమ్మ, స్వాతి, సక్కుబాయి తదితరులు పాల్గొన్నారు.



బాలికలకు స్తులు అందజేస్తున్న ఎంఇఒ

విద్యార్థులను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

వికలాంగ విద్యార్థులను ప్రోత్సహించాలని, అందుకు తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని చదివించుకోవాలని ఎంఇఒ మస్తాన్ నాయక్ తెలిపారు. స్థానిక ఎంఆర్‌సి నిర్వహించిన సమావేశంలో వికలాంగ విద్యార్థులకు వీల్ ఛైర్, రొటెటర్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఇఆర్‌పి షేక్ రిహనా బేగం తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ-2 హాస్టల్‌ను తరలిస్తే ఉపేక్షించేది లేదు

అప్లికేషన్ తీసుకునేందుకు

ఆన్‌లైన్ లాగిన్ ఓపెన్ చేయాలి

దళిత, ప్రజాసంఘాల నిరసన



నిరసన తెలియజేస్తున్న దళిత,ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి పట్టణంలోని ఎస్సీ-2 హాస్టల్‌ను తరలిస్తే ఉపేక్షించేది లేదని దళిత ప్రజా సంఘాలు సోమవారం ఆర్డీవో కార్యాలయం వద్ద దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.మోహన్ అధ్యక్షతన నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ ధర్మ పోరాట సమితి రాష్ట్ర నాయకులు చదలవాడ బాల గురవయ్య, రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు కటికల వెంకటరత్నం, మాజీ బిటిపి నాయకులు శివ కాశయ్య, చీమలదిన్నె వెంగయ్య, ప్రముఖ న్యాయవాది చింతగుంట్ల కిషోర్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో దళితులు 60 వేల కుటుంబాలు నివసిస్తున్నందున విద్యార్థులు చదువుకునేందుకు కనిగిరికి వస్తుంటారని తెలిపారు. ఇక్కడ వారికి వసతి కల్పించేందుకు గత ప్రభుత్వాలు 1970లో మర్రి చెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కనిగిరి పట్టణంలో రెండు హాస్టలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎస్సీ2 హాస్టల్‌ను పందువ నాగులవరం తరలించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారని తెలిపారు. హాస్టల్‌ని తరలించడం విరమించుకోవాలని కోరారు. ఈ క్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ కార్యదర్శి గొర్రుముచ్చు రామారావు, మాల జేఏసీ నాయకులు శాంతరాజు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు పవన్ కళ్యాణ్, కటికల అగస్టీన్, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ దమ్ము వెంకటేష్ మాట్లాడుతూ హాస్టల్‌ను తరలించినట్లయితే దళిత విద్యార్థులు నష్టపోతారని హాస్టలను ఇక్కడే కొనసాగించాలని అన్నారు. అంతేకాక హాస్టల్‌లో లాగిన్ పూర్తిగా నిలిపివేశారని దానిని పునరుద్ధరించాలని, వార్డెన్‌ను కేటాయించాలని కోరారు. పందువ నాగులవరంలో నూతన హాస్టల్ ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ఎస్సీ-2 హాస్టల్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని అర్జీని ఆర్డీవో కేశవ్‌వర్ధన్‌రెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు విజయరామరాజు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు కాజా, పందిటి కొండ చిన్నయ్య, దమ్ము శ్రీను, దద్దాల రాములు, పలుకూరి భాస్కర్, తాతపూడి నాని, అంబేద్కర్ ధర్మ పోరాట సమితి అధ్యక్షులు స్వర్ణ యానాది, గంజి రవీంద్ర రెడ్డి, పెద్ద బాలయ్య, ఎంపిటీసీ పాప బత్తిని నాగేశ్వరరావు, జొన్నలగడ్డ ధర్మేంద్ర, వెంకటేశ్వర్లు, నేలపాటి చిట్టిబాబు, పోస్ట్ కొండయ్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం, మైనార్టీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



రవితేజ మృతదేహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

కరెంట్ షాక్‌తో యువకుడు మృతి

ప్రజాశక్తి-కొండపి

కరెంట్ షాక్‌తో యువకుడి మృతి చెందిన సంఘటన కొండపి పంచాయతీలోని కట్టావారిపాలెంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కట్టావారిపాలెంలో ఆదివారం రాత్రి వర్షం కురుస్తుండడంతో రాత్రి 10 గంటల సమయంలో ఆరికట్ల రవితేజ (30) ఇంట్లో కరెంట్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీంతో యువకుడు ఫీజులు సరిచేసే ప్రయత్నం చేశాడు. ఈక్రమంలో కరెంట్ షాక్ తగలడంతో రవిజేత గట్టిగా అరుస్తూ కిందపడిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు ప్రవేటు వాహనంలో కొండపి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో ఒంగోలు రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. కొండపి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వడంతో ఎస్ఐ ప్రేమ్‌కుమార్ కేసు నమోదు చేశారు. రిమ్స్‌లో పోస్టుమార్టం చేసి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొని వచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. యువకుడు మృతితో కట్టవారిపాలెంలో విషాదం నెలకొంది. మృతుడికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు.

టీడీపీ నాయకుల నివాళి

కరెంట్ షాక్‌తో మృతి చెందిన రవితేజకు మాజీ ఏఎంసీ చైర్మన్ జి.రామయ్యచౌదరి సోమవారం పూలమాల వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో నాయకులు బత్తుల నారాయణస్వామి, నరసారెడ్డి, వసంతరావు, కృష్ణారెడ్డి, రావెళ్ల రఘునాథబాబు, అనుమాల ప్రసాదు, మానికొండ వెంకటేశ్వర్లు, రావెళ్ల చెంచయ్య, ఆరికట్ల వెంకటరావు, నేతి రవికుమార్, దేపూరి మస్తాన్ తదితరులు ఉన్నారు.



డీజీపేటలో నడిరోడ్డుపై నిల్వ ఉన్న నీరు

రహదారిపై వాన నీటితో ఇబ్బందులు

ఆర్అండ్‌బి అధికారుల తీరుపై గ్రామస్తుల ఆగ్రహం

ప్రజాశక్తి- సీఎస్‌పురం రూరల్

మండలంలోని డిజిపేటలో నన్నసాని మహాలక్ష్మయ్య ఇంటిముందు ఆర్అండ్‌బి రహదారిలో నీరు నిల్వ ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాదచారులు అటువైపు వెళ్ళాలాన్నా నీటిలోనించే వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంటుంది. ఈ సమస్య పరిష్కరించడంలో ఆర్అండ్‌బి అధికారుల నిర్లక్ష్య వైఖరిపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నీటి నుంచి వాహనాలు వెళ్లినప్పుడు మురికి నీరు అటువైపు వెళ్లే పాదచారులపై పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్అండ్‌బి అధికారులు ఈ వైపు కన్నెత్తి చూడడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురికి నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టి ఇబ్బందులు తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

దర్శిలో 3.9 సెంటీమీటర్ల వర్షపాతం

ప్రజాశక్తి-తాళ్ళూరు

ఆది, సోమవారాల్లో దర్శిలో సోమవారం 3.9 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయినట్లు ఏఎస్ఓ మహబూబాషా తెలిపారు. ఈ వర్షాలతో రైతులకు మెట్టపైలు వేయడానికి ఎంత తోడ్పడునున్నాయి. ఇటీవల కాలంలో వర్షాలు లేకపోవడంతో రైతులు పంటలు వేయడానికి చదును చేసి ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఈరోజు కురిసిన వర్షానికి మెట్టపైర్లకు వేసుకోవడానికి రైతులు సమాయత్తమవుతున్నారు. ప్రస్తుతం కంది, సజ్జ ప్రతి పంటలు రైతులు సాగు చేయనున్నారు. ఈపాటికి రైతులు గ్రామాల్లో తిరిగి వ్యవసాయ విత్తనాలు ఎరువులను గురించి పొలం పిలుస్తుందని కార్యక్రమంలో వివరించారు. అదేవిధంగా శాస్త్రవేత్తలు కూడా గ్రామాల్లో తిరిగి పంటలపై అవగాహన కల్పించారు.

క్లబ్ రోడ్డులో ఆక్రమణలు తొలగింపు

క్లబ్ చైర్మన్, టౌన్ ప్లానింగ్ అధికారుల మధ్య వాగ్వాదం

పోలీసుల ప్రవేశంతో కొనసాగిన పనులు



తొలగింపు ప్రక్రియను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి పట్టణంలోని రెడ్డి బిల్డింగ్ సెంటర్ నుంచి క్లబ్ మీదుగా తీగలగొంది వైపు ఉన్న ఆక్రమణల తొలగింపు చర్యలను మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి సువర్ణ కుమార్ సోమవారం చేపట్టారు. దీంతో కాస్మోపాలిటన్ క్లబ్ చైర్మన్, మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ క్లబ్ సభ్యులతో కలిసి తొలగింపు చర్యలను అడ్డుకున్నారు. నోటీసులు ఇచ్చి గడువు ఇస్తే రోడ్డు ఆక్రమణ తామే తొలగిస్తామని అలాకాకుండా మీరు ఎలా తొలగిస్తారని టౌన్ ప్లానింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తొలగింపు చర్యలు చేపట్టామని టౌన్ ప్లానింగ్ అధికారి సువర్ణ కుమార్ మున్సిపల్ చైర్మన్‌కు తెలిపారు. ప్రజలు నివసించే గృహ సముదాయాలు, పెద్ద పెద్ద భవనాలకు మాత్రమే నోటీసులు ఇస్తారని, గోడలకు నోటీసులు ఇవ్వరని అది చట్టమని టౌన్ ప్లానింగ్ అధికారి చైర్మన్‌కు వివరించారు. ఈ క్రమంలో క్లబ్ సభ్యులకు, టౌన్ ప్లానింగ్ అధికారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలో ప్రక్రియ కొద్దిసేపు నిలిచిపోయింది. సమస్యను మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లడంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. ఆక్రమణల తొలగింపును అడ్డుకోవడానికి వీల్లేదని క్లబ్ సభ్యులకు ఏఎస్ఐ శ్రీనివాసులు సూచించారు. రోడ్డు ఆక్రమణ తొలగింపు ప్రక్రియ తిరిగి ప్రారంభమైంది.

అద్దె కట్టలేదని కార్యాలయానికి తాళం

19 నెలలుగా అద్దె చెల్లించని ఉపాధి హామీ అధికారులు



తాళాలు వేసిన దృశ్యం

ప్రజాశక్తి-మద్దిపాడు

అద్దె కట్టలేదని ఉపాధి హామీ కార్యాలయానికి ఇంటి యజమాని తాళం వేశారు. సోమవారం ఈ విషయం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే మండల కేంద్రమైన మద్దిపాడులో ఉపాధి హామీ కార్యాలయం ఓ ప్రైవేటు భవనంలో కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. 19 నెలలు నుంచి అద్దె చెల్లించలేదని సదరు ఇంటి యజమాని ఏపీవో ధనుంజయ్ వర్మను పలు సార్లు అడిగారు. ఆయన నుంచి సరైన సమాధానం రాకపోవడంతో ఇంటికి తాళం వేశారు. సోమవారం విధులకు హాజరైన సిబ్బంది కార్యాలయానికి తాళం వేయడంతో కంగుతిన్నారు. ఏడాది కిందట కార్యాలయాన్ని ప్రభుత్వ భవనంలోకి మార్చుకోవాలని పిడి కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చాయని, ఈ విషయం ఏపీవో ధనుంజయ వర్మ ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లలేదని, కార్యాలయానికి తాళం వేసిన సంగతి జిల్లా అధికారుల నుంచి ఫోన్ వచ్చేదాకా ఎంపీడీవో జ్యోతికి తెలియదని సమాచారం. అద్దె విషయమై సదరు ఇంటి యజమాని పట్ల ఏపీవో సరైన సమాధానం చెప్పకపోవడంతో తాళం వేసినట్లు చర్చించుకుంటున్నారు.

వీధుల్లో భిక్షాటన చేస్తూ కార్మికుల నిరసన



భిక్షాటన చేస్తూ నిరసన తెలుపుతున్న కార్మికులు

ప్రజాశక్తి-కనిగిరి : మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని సిఐటియు జిల్లా నాయకులు పిసి కేశవరావు అన్నారు. కార్మికులు చేపట్టిన సమ్మె సోమవారం ఆరో రోజుకు చేరుకుంది. మున్సిపల్ కార్యాలయం వద్ద నుంచి పట్టణంలోని ప్రధాన వీధులలో భిక్షాటన చేస్తూ నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా కేశవరావు మాట్లాడుతూ కనిగిరి మున్సిపాలిటీలో జనాభాకు తగ్గట్టు పారిశుద్ధ్య కార్మికులను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు చార్లెస్, లక్ష్మయ్య, ప్రసాద్, సిఐటియు నాయకులు నరేంద్ర పాల్గొన్నారు.

సముద్రంలో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-కొత్తపట్నం



చందు (ఫైల్)

మడనూరు బీచ్‌లో ఆదివారం గల్లంతైన ఇద్దరిలో ఒకరు క్షేమంగా ఒడ్డుకు చేరగా, మరొకరు సముద్రంలో కొట్టుకుపోయారు. సోమవారం ఉదయం రాజుపాలెం పట్టపుపాలెం వద్ద మర్లపాడుకు చెందిన జలదంకి చందు మృతదేహం లభ్యమైనట్లు మెరైన్ పోలీసులు తెలియజేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఒంగోలు రిమ్స్ హాస్పిటల్‌కు తరలించినట్లు ఎస్సై సుధాకర్ తెలియజేశారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

మండల పరిధిలోని వీరభద్రాపురం గ్రామంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిలిప్ అనే వ్యక్తి 12 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసున్నట్లు ఎక్సైజ్ సిఐ శ్రీనివాసులు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు, వ్యాన్ ఢీ

ప్రజాశక్తి-కొండపి



బస్సు, వ్యాన్ ఢీకొన్న దృశ్యం

మండలంలోని చోడవరం మలుపు వద్ద ఆర్టీసీ బస్సు, మినీ వ్యాన్ ఢీకొన్న సంఘటన సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. కొండపి నుంచి టంగుటూరు వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు టంగుటూరు వైపు నుంచి కొండపి వస్తున్న మినీ వ్యాన్ చోడవరం మలుపు వద్దకు వచ్చేసరికి ఎదురు ఎదురుగా ఢీకొన్నాయి. బస్సు ముందు భాగం ధ్వంసం కాగా డ్రైవర్ చేతికి స్వల్ప గాయాలయ్యాయి. బస్సులోని ప్రయాణికులు అందరూ సురక్షితంగా ఉండటంతో ఊపిరి పీల్చుకున్నారు. దీంతో సుమారు గంట పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది.



కార్మికుల సమస్యలపై ఈఓను కలిసిన సుబ్బారావు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కొల్లూరు

కొల్లూరు పంచాయతీ పరిధిలో మురిగు కాలువల్లో పూడికలు, చెత్త ఎత్తేస్తున్న కార్మికుల సమస్యలపై కార్మికులు పరిష్కరించాలని సిపిఎం నాయకులు బొనిగల సుబ్బారావు పంచాయితీ ఈఓ శంకర్రావును కోరారు. కార్మికుల సమస్యలు ఆయనకు వివరించారు. పంచాయితీ పారిశుధ్య కార్మికులకు చేతుల బ్లౌజులు, డెటాల్ సబ్బులు 6, బట్టల సబ్బులు 6, కొబ్బరి నూనె అరకేజీ ఇవ్వాలని కోరారు. ఈఓ స్పందిస్తూ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

అన్నదాత సుఖీభవలో నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి - యద్దనపూడి



ఎఓ కుమారి

మండలంలోని అర్హత కలిగిన రైతులు అన్నదాత సుఖీభవ జాబితాలో తమ పేర్లు లేనట్లయితే గ్రామ వ్యవసాయ సహాయకుల వద్ద పూర్తి వివరాలతో నమోదు చేసుకోవాలని ఎఓ ఎస్‌విపి కుమారి కోరారు. జిల్లాలో వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం కింద ప్రతి పంటకు ప్రధానమంత్రి ఫసల్ యోజన బీమా ద్వారా మిరప, కంది, మినుము అమలు చేయనున్నట్లు తెలిపారు. వరి పంటకు ఆగస్టు 31లోపు పంటల బీమా ప్రీమియం చెల్లించాలని అన్నారు. మిగిలిన పంటలకు జూలై 31లోపు పంటలు బీమా ప్రీమియం చెల్లించాలని కోరారు. బ్యాంకు ద్వారా పంట రుణం తీసుకునే రైతులు నేరుగా బ్యాంకులో భీమాకు ప్రీవియం చెల్లించవచ్చని అన్నారు. వరి పంటకు భీమ రూ.40వేలు, ప్రతి పంటకు రూ.38వేలు, ఎర్ర మిరపకు రూ.90వేలు, కంది, మినుము పంటలకు రూ.20వేలు నష్టపోతే పరిహారం చెల్లిస్తారని తెలిపారు. రైతులందరూ సకాలంలో పంటల బీమా ప్రీమియం చెల్లించి వాతావరణ విపత్తుల వల్ల జరిగే నష్టాన్ని భీమా వల్ల భర్తీ చేసుకోవచ్చని తెలిపారు.



దాడులు చేస్తున్న మున్సిపల్ అధికారులు

ప్లాస్టిక్ విక్రేతల గిడ్డంగులపై దాడులు

ప్రజాశక్తి - బాపట్ల

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ సమూలంగా నిషేధించాలని జిల్లా స్థాయిలో అధికారులు, స్వచ్ఛంద సేవా సంస్థలు సభలు, ర్యాలీలు నిర్వహించి ప్రజల్లో ప్రచారం నిర్వహిస్తున్నప్పటికీ వ్యాపారులు సింగిల్ యూజ్ క్యారీ బ్యాగులు విక్రయిస్తూనే ఉన్నారు. పట్టణంలో ప్లాస్టిక్ నిల్వలున్న హెూల్‌సేల్ ప్లాస్టిక్ వ్యాపారుల గిడ్డంగులపై శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సయ్యద్ నజీర్, సిహెచ్ కరుణ, మునిసిపల్ సిబ్బందితో కలిసి భావన్నారాయణ స్వామి దేవస్థానం సమీపంలోని బొడ్డుపల్లివారివీధిలో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో 90 కిలోల సింగిల్ యూజ్ ప్లాస్టిక్ స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ జి రఘునాధరెడ్డి మాట్లాడుతూ ప్రజలు, వ్యాపారస్తులకు పలు మార్లు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. అయినప్పటికీ వ్యాపారులు విచ్చలవిడిగా ప్లాస్టిక్ అమ్మకాలు కొనసాగిస్తూనే ఉన్నారని అన్నారు. ఇకపై ఇదే విధంగా నిబంధనలు అతిక్రమించి విక్రయిస్తే కఠిన చర్యలు ఉంటామని హెచ్చరించారు. ప్రజలు స్వచ్ఛందంగా ప్లాస్టిక్ నిషేధించి గుడ్డ సంచులు వినియోగించాలని కోరారు.

'అంగన్‌వాడీ' యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా



నిరసన వ్యక్తం చేస్తున్న అంగనవాడీ కార్యకర్తలు



వినతిపత్రం ఇస్తున్న సిఐటియు అమర్తలూరు నాయకులు

ప్రజాశక్తి - నిజాంపట్నం

మండలంలోని అంగన్‌వాడీ లబ్ధిదారులకు ఫేస్ యాప్ రద్దుచేయాలని, అన్ని యాప్స్ కలిపి ఒక యాప్‌గా మార్చాలని కోరుతూ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆఫీసు వద్ద ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటీయు) ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. పల్లపట్ల సిడిపిఓ ఆఫీస్ వద్ద ధర్నా అనంతరం యుడిసికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు సీహెచ్ మణిలాల్ మాట్లాడుతూ సెంటర్ నిర్వహణకు ఒక్క యాప్ మాత్రమే నిర్వహించాలని, ఐసిడిఎస్ లక్ష్యం పేద గర్భిణీలు, బాలింతలు, చిన్న పిల్లలకు ఆహారం, ఆరోగ్యం, విద్య అందించాలని, పోషణ ట్రాకర్ యాప్, బాల సంజీవిని యాప్ తీసుకురావడంతో లబ్దిదారులకు ఓటీపీ ద్వారా ఈకెవైసీ చేసి ఫోటో క్యాప్చర్ చేస్తేనే సరుకులు ఇచ్చేలాగా పెట్టిన నిబంధన తొలగించాలని కోరారు. గతంలో వలె లబ్దిదారులు సంతకం పెట్టించుకొని సరుకులు ఇచ్చే విధానం కొనసాగించాలని డిమాండ్ చేశారు. పల్లపట్ల ప్రాజెక్ట్ అధ్యక్షురాలు వై మేరీమణి మాట్లాడుతూ యాప్‌ల భారంతో అంగన్వాడీలు తీవ్ర అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని అన్నారు. వేతనాలు పెంచకుండా రోజువారి పని పెంచుతున్నారని అన్నారు. ఆన్లైన్ ద్వారా నమోదు చేసి లబ్ధిదారులకు ఎఫ్‌ఆర్‌ఎస్ ద్వారా సరుకులు ఇవ్వాలంటే కింద స్థాయిలో సమస్యలు వస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ సిహెచ్ ప్రహ్లాదుడు, అంగన్‌వాడీ యూనియన్ కార్యకర్తలు బేబీరాణి, రమాదేవి, దిల్షాద్, సీతా మహాలక్ష్మి, అచ్చమ్మ పాల్గొన్నారు.

అమృతలూరు : అంగన్‌వాడీలకు ఎఫ్ఆర్ఎస్ యాప్‌లు రద్దు చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో సిడిపిఓ ఏ లక్ష్మిదేవికి వినతి పత్రం సోమవారం అందజేసారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రాజెక్ట్ గౌరవా ధ్యక్షులు బి అగస్టీన్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వా లు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాలింతలు, పిల్లలకు అందిస్తున్న సరుకులు పోషణ ట్రాకర్, బాల సంజీవినీ యాప్ ద్వారా ఇవ్వాలని చెబుతున్నప్పటికీ సరైన ఫోన్‌లు లేనందున చేయలేకపోతున్నారని అన్నారు. 5జి స్పీడ్ నడుస్తున్న ఈ కాలంలో ఎప్పుడో 2022లో ఇచ్చిన 2జి నెట్‌వర్క్ ఫోన్లు, అవి కూడా 90శాతం పాడైపోయి పని చేయడం లేదని అన్నారు. పని చేయని ఫోన్లతో పని చేయమంటే ఎలా చేస్తారని ప్రశ్నించారు. దీనివలన ప్రీ స్కూల్ దెబ్బతింటున్నదని వాపోయారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు యు సుజాత, ఎం రాణి, ఎన్ బుల్లెమ్మాయి, ఎ జ్యోతి పాల్గొన్నారు.

వేటపాలెం : అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, మినీ కార్యకర్తలు, గర్భిణీలు, బాలింతలు, పిల్లలకు ఫేస్ యాప్ రద్దు చేయాలని అంగన్‌వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు జిల్లా కార్యదర్శి ఎలిజిబెత్ రేఖ డిమాండ్ చేశారు. స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఓటిపి ద్వారా సరుకులు పంపిణీ చేసేందుకు తమ వద్ద ఉన్న పాత ఫోన్ల ద్వారా సాధ్యం కాదని, అన్ని యాప్‌లు కలిపి ఒకటి చేయాలని కోరారు. ఆన్లైన్‌లో రిజిస్టర్ అయితేనే వచ్చే నెలలో సరుకులు వస్తాయని బెదిరిస్తున్నారని, దీనివల్ల రాబోయే కాలంలో అంగన్‌వాడీ సెంటర్‌కు వచ్చే లబ్ధిదారులు, పిల్లలు తగ్గిపోయే ప్రమాదం ఉందని అన్నారు. లబ్ధిదారులు గతంలో వలె సంతకం పెట్టించుకుని సరుకులు ఇవ్వాలని కోరారు. అంగన్‌వాడీలు, గర్భిణీలు, బాలింతలు, చిన్న పిల్లలకు ఎఫ్‌ఆర్‌ఎస్ రద్దు చేయాలని, ప్రీస్కూల్ బలోపేతానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సెక్టార్ లీడర్లు ఎ బ్యుల, ప్రమీల, డి బుల్లమ్మాయి పాల్గొన్నారు.

రేపల్లె : అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, బాలింతలు, పిల్లలకు ఫేస్ యాప్ రద్దు చేయాలని కోరుతూ సిడిపిఓ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. అంగన్‌వాడీ యూనియన్ (సిఐటీయు) ఆధ్వర్యంలో సిడిపిఓ ఎం సుచిత్రకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె ఝాన్సీ మాట్లాడారు. అన్ని రకాల యాప్‌లు కలిపి ఒకటి చేయాలని, యాప్‌ల భారం తగ్గించాలని కోరారు. బియ్యం, పప్పు, ఆయిల్, గుడ్లు, కిట్లు సరుకులు గతంలో మాదిరి సంతకం చేయించుకుని ఇచ్చే విధానం కొనసాగించాలని కోరారు. ప్రీ స్కూల్‌లను బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ నాయకులు కె రత్నకుమారి, ఎన్ కృష్ణకుమారి, డి జ్యోతి, అరుణ, శ్రీలత పాల్గొన్నారు.



వేటపాలెంలో నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు



రేపల్లెలో వినతి పత్రం ఇస్తున్న జిల్లా అధ్యక్షురాలు ఝాన్సీ

పాఠశాల అభివృద్ధికి దాతల సహకారం

ప్రజాశక్తి - నిజాంపట్నం



మాట్లాడుతున్న ఎంఇఓ జి శేషు గోపాలం

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతల సహకారం ఎంతైనా అవసరమని ఎంఇఓ జి శేషు గోపాలం అన్నారు. స్థానిక మాజీ సైనికుల కాలనీ ప్రాథమిక పాఠశాల్లో విద్యార్థులకు దాతలు రిటైర్డ్ జిల్లా సోషల్ వెల్ఫేర్ అధికారి తాత వెంకటేశ్వరరావు, మాజీ సైనిక ఉద్యోగి తాతా నాగేశ్వరరావు పాఠశాలకు ఒక టీవీ, విద్యార్థులకు భోజనం ప్లేట్లు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా సోషల్ వెల్ఫేర్ మాజీ జిల్లా అధికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పాఠశాల పూర్వ విద్యార్థులమైన తాము పాఠశాలకు టీవీ బహుకరించడం ఆనందంగా ఉందని, పాఠశాల్లో చదివిన రోజులు గుర్తుకు వచ్చాయని తెలిపారు. తాము చదువుకున్న పాఠశాల్లో విద్యార్థులకు భోజనం ప్లేట్లు అందజేయడం ఆనందాన్ని కలిగించిందని మాజీ సైనిక ఉద్యోగి నాగేశ్వరరావు అన్నారు. ఎంఇఓ శేషు గోపాలం మాట్లాడుతూ ఆగస్టు 4 నుండి జరిగే ఫార్మేటివ్ వన్ పరీక్షలకు విద్యార్థులు అందర్నీ సిద్ధం చేయాలని, అన్ని సామర్థ్యాలు సాధించేలా కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చుక్కా బాపయ్య, పాఠశాల కమిటీ చైర్మన్ జి రజిని, షేక్ ఆరిపున్నీసా పాల్గొన్నారు.

వైసిపి ట్రేడ్ యూనియన్ అధ్యక్షునిగా అంకబాబు

ప్రజాశక్తి - భట్టిప్రోలు



అంకబాబును అభినందిస్తున్న అశోక్ బాబు

వైసిపి ట్రేడ్ యూనియన్ మండల అధ్యక్షునిగా వాకా అంకబాబును నియమించారు. వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైసిపి ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబు అధికారికంగా ప్రకటించారు. పార్టీ కోసం పనిచేసిన తనకు ట్రేడ్ యూనియన్ అధ్యక్షునిగా నియమించడం ఆనందంగా ఉందని అంకబాబు తెలిపారు. అనంతరం వైసిపి నాయకులతో కలిసి తనకు పదవి అలంకరించిన అశోక్ బాబును కలిసి ధన్యవాదాలు తెలిపారు. వైసిపి మండల కన్వీనర్ పడమటి శ్రీనివాసరావు, ఆర్టిఐ విభాగం ప్రధాన కార్యదర్శి గోవర్ధనగిరి వెంకట సీత మల్లేశ్వర వరప్రసాద్ (పెదబుజ్జి), సూరేపల్లి సర్పంచ్ సత్యనారాయణ, భట్టిప్రోలు పట్టణ అధ్యక్షులు కుందేటి రమేష్, మోర్ల కోటయ్య తదితరులు అంకబాబును దుశ్శాలువాలతో సత్కరించారు



పొగాకు కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం

నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలోని తూర్పు కొప్పెరపాడు గ్రామంలో నల్లబర్లి పొగాకు కొనుగోలు కేంద్రాన్ని తహశీల్దారు పి సింగారావు సోమవారం ప్రారంభించారు. పంగులూరు మార్కెట్ యార్డులో 20 రోజులు క్రితం పొగకు కొనుగోలను ప్రారంభించగా అక్కడున్న రెండు గోడౌన్లు పొగాకు బెల్లతో నిండిపోవడంతో తూర్పు కొప్పెరపాడులో సొసైటీకి చెందిన గోడౌన్లో పొగాకు బేళ్లను నిల్వ చేసే విధంగా ఇక్కడ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తహశీల్దారు సింగారావు మాట్లాడుతూ తూర్పు కొప్పెరపాడు గోడౌన్‌లో 700 బేళ్ళకు మాత్రమే అవకాశం ఉందని తెలిపారు. ఇది రెండు, మూడు రోజుల్లో నిండిపోతుందని అన్నారు. పొగాకు రైతులకు ఇబ్బంది లేకుండా పొగాకు కొనేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని, అందులో భాగంగానే ఈ గోడౌన్‌లో కూడా నింపేందుకు ప్రభుత్వం తీసుకుందని చెప్పారు. రైతులు అధైర్య పడాల్సిన పనిలేదని అన్నారు. రైతుల వద్ద నాణ్యమైన పొగాకు మొత్తం కొనుగోలు చేస్తారని తెలిపారు. నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో బయ్యర్ మారేళ్ల శ్రీధర్, పంగులూరు పిఎసిఎస్ సెక్రటరీ లక్ష్మీ దేవి, టిడిపి అధ్యక్షులు రమేష్ బాబు, ఎనికపాటి శ్రీను, పూనాటి రామాంజనేయులు పాల్గొన్నారు.

ఐద్వా నగర నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ


గోవిందమ్మ, ఆదిలక్ష్మి

ఐద్వా ఒంగోలు నగర 12వ మహాసభ సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా మహాసభలో 15 మంది సభ్యులతో నూతన కమిటీని ఎన్నిక చేశారు. బి.గోవిందమ్మ నగర అధ్యక్షురాలిగా, జి.ఆదిలక్ష్మి నగర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. నగర కమిటీ సభ్యులుగా కే. రాజేశ్వరి, జి. కళ్యాణి, బి. రాజ్యలక్ష్మి, బి. ప్రేమలత, డి. మధురవాణి, కె. విజయలక్ష్మి, యు. రాజ్యలక్ష్మి, కె. రాణి, ఎస్.కే. మొబినా తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జరిగిన మహాసభలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పలు తీర్మానాలను ఆమోదించారు. నగరంలో స్మార్ట్ మీటర్లు తొలగించాలని, కరెంట్ చార్జీలు, విద్యుత్ భారాలను వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. రోజురోజుకు పెరుగుతున్న దొంగతనాలను అరికట్టాలని, మహిళలపై జరుగుతున్న దాడులను అడ్డుకోవాలని తీర్మానం చేశారు. ఒంటరి మహిళలు, వితంతు మహిళలకు ప్రభుత్వం వెంటనే పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేషన్ పాలకవర్గం ప్రతి రోజూ మంచినీరు సరఫరా చేస్తామని ఇచ్చిన వాగ్దానం ఇంకా అమలు కాలేదని, వెంటనే అమలు చేయాలని తీర్మానించారు. అలాగే మహిళలకు ఇంటి పట్టాలు ఇవ్వడం, టిడ్కో ఇళ్ళు పూర్తి చేసి పంపిణీ చేయడం వంటి హామీలు ఇంకా అమలు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరితగతిన అమలు చేయాలని డిమాండ్ చేశారు. శివారు కాలనీల్లో మౌలిక సదుపాయాలను కల్పించాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరారు. మహాసభలో మహిళల హక్కులు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఐద్వా నిరంతరం పోరాటం చేస్తుందని నూతన కమిటీ స్పష్టం చేసింది.


అవగాహన కల్పిస్తున్న శ్రీకాంత్

చట్టాలపై విద్యార్థులకు అవగాహన

ఘర్షణ ఘటనపై సిఐ శ్రీకాంత్ విచారణ

ప్రజాశక్తి-సంతనూతలపాడు

సంతనూతలపాడు మండలం, ఎండ్లూరు డొంక వద్ద గల ఐఐఐటి కళాశాల (రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్)లో ఒంగోలు రూరల్ సిఐ ఎన్.శ్రీకాంత్‌బాబు ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులతో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఒంగోలు రూరల్ సర్కిల్ సిఐ ఎన్.శ్రీకాంత్‌బాబు మాట్లాడుతూ గత నాలుగు రోజుల క్రితం కాలేజీ నందు కొంతమంది విద్యార్థులు మధ్య జరిగిన ఘర్షణ విషయమై విచారించారు. సంబంధిత విద్యార్థులకు చట్టాల మీద అవగాహన కల్పించి.. కౌన్సిలింగ్ ఇచ్చారు. దాదాపు 300 మంది విద్యార్థులకు డ్రగ్స్ వాడటం వల్ల ఎలాంటి పరిణామాలు ఎదురవుతాయో వివరించి.. అవగాహన కల్పించారు. త్రిబుల్ ఐటీ ఏవోతో పాటు పిల్లల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సంతనూతలపాడు అజయ్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కొల్లా నాగేశ్వరరావు

శాస్త్రీయ దృక్పథం అలవరచుకోవాలి..

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ప్రతి ఒక్కరూ శాస్త్రీయ దృక్పథం అలవరచుకోవాలని జనవిజ్ఞానవేదిక ప్రధాన సలహాదారు డాక్టర కొల్లా నాగేశ్వరరావు అన్నారు. సోమవారం జానవిజ్ఞాన వేదిక ప్రకాశం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 'సరిగ్గా ఆలోచించడం ఎలా?' అనే అంశంపై జిల్లా స్థాయి శిక్షణా తరగతులు నిర్వహించారు. జెవివి రాష్ట్ర ఉపాధ్యక్షులు కొల్లా మధు మొక్కలు పంపిణీ చేసి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కంచర్ల వెంకటేశ్వర్లు గయాజ్ భాషా, కొమ్మిరెడ్డి కొండమ్మ, మీనదనంజయ, చిట్టా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ కార్మికులకు

జీవో నెం.36 అమలు చేయాలి

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

కళ్లకు గంతలు కట్టుకొని కార్మికుల నిరసన



కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలుపుతున్న కార్మికులు

జీవో నెంబర్ 36 ప్రకారం కనీసం రూ.21 వేల నుంచి రూ.24 వేల వరకు ఇవ్వాలని కార్మికులు డిమాండ్ చేస్తుండగా జీవో 124 ప్రకారం చెల్లిస్తామన్న ప్రభుత్వ నిర్ణయాన్ని ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) వ్యతిరేకిస్తున్నట్లు నాయకులు ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె సోమవారం నాటికి తొమ్మిదో రోజుకు చేరింది. ఒంగోలు మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు కళ్ళకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు నగర కార్యదర్శి టీ.మహేష్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి కొర్నెపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మికులకు అరకొరగా పెంపు ఇస్తూ పారిశుధ్య కార్మికుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలపై ఇంజనీరింగ్ కార్మికులు ఎనిమిది రోజులుగా, పారిశుధ్య కార్మికులు ఆరు రోజులుగా సమ్మెలో పాల్గొంటున్నారన్నారు. కార్మికుల ఆప్కాస్ కోడ్ తొలగించాలని, సంక్షేమ పథకాలు ఎటువంటి నిబంధనలు లేకుండా అమలు చేయాలని, 17 రోజుల సమ్మె వేతనం చెల్లించాలని రిటైర్మెంట్ వయసు 62 ఏళ్లకు పెంచాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కాగా సుప్రీంకోర్టు సూచనల ప్రకారం కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేసి శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగాలు కల్పించాలని, సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు సమ్మె కొనసాగిస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నగర అధ్యక్ష కార్యదర్శులు జి.నరసింహ, తేళ్ల విజయమ్మ, ఆర్ శ్రీనివాసరావు, డీ మరియబాబు, కె వెంకటేశ్వర్లు, బుట్టి బాబు, రమణమ్మ, కె మోహన్ రావు, భారతి, బి సుబ్బారావు, కె ఆనంద్, అనిత, రాములు, కొర్నేపాటి. మోహన్రావు, కె జాలయ్య, ప్రతాప్, సుధాకర్‌రావు, శ్రీదేవి, కాకర్లమూడి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రసాయనిక ఎరువుల వాడకం తగ్గించండి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

బయో ఫెర్టిలైజర్ స్టాల్‌ను ప్రారంభించిన కలెక్టర్ అన్సారియా


స్టాల్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ అన్సారియా

రసాయనిక ఎరువుల వాడకం తగ్గిస్తే రైతులకు సాగు ఖర్చులు తగ్గుతాయని కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. బయో ఫెర్టిలైజర్స్, జీవ ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించే లక్ష్యంతో ఒంగోలు కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను సోమవారం కలెక్టర్ తమీమ్‌అన్సారియా, జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణతో కలిసి ప్రారంభించారు. బయో ఫెర్టిలైజర్స్, జీవ ఎరువుల వాడకంతో కలిగే ప్రయోజనాలపై జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ ఎస్. శ్రీనివాసరావు మాట్లాడుతూ రసాయనిక ఎరువుల వాడకంతో పర్యావరణానికి ఎంతో ముప్పు కలుగుతోందన్నారు. బయో ఫెర్టిలైజర్స్ వాడకం వల్ల నేల సారం మెరుగుపడుతుందన్నారు. రైతులకు సాగు ఖర్చు తగ్గుతుందన్నారు. ఈ విషయాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు ఈ స్టాల్ ఏర్పాటు చేశామన్నారు. రైతులకు అవసరమైన బయో ఫెర్టిలైజర్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా బయో ఫెర్టిలైజర్స్, జీవ ఎరువులు తయారుచేసే దోర్నాలకు చెందిన రైతు ఈదర శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కషాయాలు, ఇతర ప్రకతి ఆధారిత ఉత్పత్తుల వల్ల రైతులకు సాగు ఖర్చు గణనీయంగా తగ్గుతుందన్నారు. ఉత్పత్తి కూడా పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో

పాత విధానంలోనే ఫీడింగ్ కొనసాగించాలి

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఎఫ్ఆర్ఎస్‌ను నిరసిస్తూ లబ్ధిదారుల ఆందోళన


ఎఫ్ఆర్ఎస్‌ను నిరసిస్తూ ఆందోళన చేస్తున్న దృశ్యం

అంగన్వాడీ కేంద్రాల్లో పాత పద్ధతిలోనే ఫీడింగ్ కొనసాగాలని పలువురు బాలింతలు, గర్భిణులు విజ్ఞప్తి చేశారు. సోమవారం నాడు ఆంధ్రప్రదేశ్ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పిలుపు మేరకు లబ్ధిదారులు, అంగన్వాడి కార్యకర్తలు ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని నిరసిస్తూ స్త్రీశిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ చిన్న పిల్లలతో గంటలతరబడి కేంద్రాలలో కూర్చోవడం కష్టమని, ఫేస్ యాప్ కారణంగా పదే పదే కేంద్రాలకు రావాల్సి వస్తోందని వాపోయారు. గతంలో తమ కుటుంబ సభ్యులు వెళ్లి సంతకాలు పెట్టి ఫీడింగ్ తీసుకొచ్చేవారని లబ్ధిదారులు గుర్తు చేశారు. ప్రభుత్వ నిబంధనల కారణంగా ఇప్పుడు తామే పసిపిల్లలతో వెళ్లి గంటలు కూర్చోవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫేస్ మ్యాచ్ అవటం లేదని, పలు మార్లు అంగన్వాడీ కేంద్రాలకు పిలవడం సరికాదన్నారు. ఇటువంటి ఇబ్బందులు తమకు అవసరం లేదని, పాత విధానంలోనే ఫీడింగ్ కొనసాగించాలని లబ్ధిదారులు స్పష్టం చేశారు. అనంతరం సిడిపిఓ ఫణిరాజకుమారికి వినతిపత్రం అందజేసి తమ సమస్యలను ఏకరువు పెట్టారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఈదర అన్నపూర్ణ, ప్రాజెక్టు కార్యదర్శి హేమిమా, అధ్యక్షురాలు పద్మావతి, జిల్లా కోశాధికారి కెవి సుబ్బమ్మ, యూనియన్ గౌరవాధ్యక్షులు టి. మహేష్, అంగన్వాడి కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఇఎస్ఐ హాస్పిటల్స్ పనితీరుపై ప్రశ్న

ప్రజాశక్తి ఒంగోలు కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఇఎస్ఐ వైద్యశాలలు, పని చేస్తున్న ఉద్యోగులు, నిర్మాణంలోని వైద్యశాలలు, నిధులు, సిబ్బంది, రోగులు, స్థాయి పెంపుతో నవీకరణపై ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ సహాయ మంత్రి, సుశ్రీ శోభ కరండ్లాజే సమాధానమిస్తూ ప్రస్తుతం రాష్ట్రంలో కాకినాడ, విశాఖపట్నం, రాజమహేంద్రవరం, తిరుపతి, విజయవాడ పట్టణాలలో ఇ.ఎస్.ఐ. వైద్యశాలలు పనిచ్చేస్తున్నాయన్నారు. గుంటూరు, కర్నూలు, శ్రీకాకుళం, శ్రీ సిటీ నెల్లూరు పట్టణాలలో వైద్యశాలలకు స్థలాల కేటాయింపు దశలో ఉండీ నిర్మాణ పనులు అప్పగించామన్నారు. విజయనగరం, విశాఖపట్నం, అచ్యుతాపురం పట్టణాలలో నిర్మాణాలు వివిధ దశలలో ఉన్నాయని తెలిపారు. ఈ వైద్యశాలలో లబ్ధిదారులకు సరిపడా అన్ని సదుపాయాలు, వైద్య సేవలు అందించుటకు నిధులు రాష్ట్రాలకు విడుదల చేశామన్నారు. గత ఐదు సంవత్సరాలలో కేంద్రం, రాష్ట్రాల వాటాలో రూ.973 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. కాకినాడ, విశాఖపట్నం, తిరుపతి, రాజమహేంద్రవరం, విజయవాడ పట్టణాలలోని వైద్యశాలలకు సంబంధించి 800 పోస్టులు మంజూరు కాగా, 273 భర్తీ అయ్యాయని, 527 ఖాళీగా వున్నాయని తెలిపారు. రాష్ట్రంలోని ఇ.ఎస్.ఐ. వైద్యశాలలలోని అన్ని పరికరాల పనితీరుపై ఆంధ్రప్రదేశ్ వైద్యశాఖ నియమించిన నిపుణుల కమిటీ అందించిన సిఫారసులపై పంపిన ప్రతిపాదనలను ప్రభుత్వం ఆమోదించినదని కేంద్ర మంత్రి తెలియజేశారు.

రాజకీయ కక్షతోనే మిథున్‌రెడ్డిపై కేసు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి లిక్కర్ కేసు చంద్రబాబు రాజకీయ కక్షలకు ఉదాహరణ అని వైయస్సార్ కాంగ్రెస్ జిల్లా బిసి సెల్ అధ్యక్షులు బొట్లా సుబ్బారావు ఆరోపించారు. సోమవారం నాడు జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లేని కేసులు సష్టించి జగన్ వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని నిర్దోషులను కూడా ఇరికించి అరెస్టులు చేస్తున్నారని విమర్శించారు. ఆరోపణలు స్థిరంగా లేవని, ఇప్పటివరకు డబ్బు సీజ్ చేయడం గానీ, పెట్టుబడులు గానీ పట్టుకోలేదని పేర్కొన్నారు. కొద్దిమంది ఉద్యోగులను బెదిరించి వాంగ్మూలాలు రాబట్టి కుట్ర కేసు నడుపుతున్నారంటూ మండిపడ్డారు. చంద్రబాబు ఇప్పటికే 7 కేసుల్లో బెయిల్‌పై ఉన్నా, తనపై ఉన్న కేసులను నిలువరించి వైయస్సార్ కాంగ్రెస్‌పై కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. 2014-19లో చేసిన లిక్కర్ కుంభకోణాన్ని దాచేందుకే ఇదంతా అని, ప్రజలు లిక్కర్ రేట్లు, అవినీతిని గమనిస్తున్నారని, ఎంత కుట్ర చేసినా తమ పోరాటం ఆగదని తెలిపారు. సమావేశంలో విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ జి రజిని, మాతా శిశు వైద్యశాల మాజీ డైరెక్టర్ సాధం విజయలక్ష్మి, సిటీ బిసి సెల్ అధ్యక్షులు సుతారం శ్రీను, దాసరి కరుణాకర్ పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులపై సత్వర చర్యలు

ఎస్పీ దామోదర్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రజాసమస్యలపై వచ్చిన ఫిర్యాదులపై సత్వర చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశించారు. ప్రజల నుండి వచ్చే వివిధ రకాల సమస్యల ఫిర్యాదులను పరిష్కరించేందుకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం) కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లాలో పలు ప్రాంతాల నుండి ప్రజలు నేరుగా వచ్చి తమ ఫిర్యాదుదారులను రాత పూర్వకంగా విన్నవించుకున్నారు. ఫిర్యాదుదారుల అర్జీలను స్వీకరించి, వారితో ముఖాముఖీ మాట్లాడి వారి ఫిర్యాదులపై సవివరంగా అడిగి తెలుసుకునీ చట్ట ప్రకారం విచారణ జరిపి, సత్వరం పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఎస్పీ మాట్లాడుతూ చట్ట ప్రకారం విచారణ జరిపి, నిర్దిష్ట కాలపరిమితిలోపల పరిశీలించి, ఫిర్యాదుదారులకు త్వరితగతిన న్యాయం అందించాలన్నారు. కార్యక్రమంలో మహిళ పోలీస్ స్టేషన్ డిఎస్పీ రమణ కుమార్, ఎస్సీ/ఎస్టీ సెల్ ఇన్స్పెక్టర్ దుర్గ ప్రసాద్, డిటిసి ఇన్స్పెక్టర్ షమీముల్లా, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ పాండురంగారావు, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఎస్సై జనార్ధన్‌రావు పాల్గొన్నారు.

అర గుండు గీయించుకొని కార్మికుల నిరసన



అద్దంకిలో అరగుండుతో నిరసన తెలుపుతున్న కార్మికులు

ప్రజాశక్తి - అద్దంకి

మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని, ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని సిఐటియు నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు అన్నారు. కార్మికులు సమ్మె 9వ రోజు చేరుకుంది. ఈ సందర్భంగా కార్మికులు వినూత్నంగా అర గుండు గీయించుకుని నిరసన తెలిపారు. ప్రభుత్వం కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా అత్యంత దుర్మార్గపు వైఖరిని అవలంబించడం ఏమిటని ప్రశ్నించారు. కార్మికుల వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని నిరసన గలన్ని వినిపించారు. రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులు సమ్మెలో ఉన్నప్పటికీ ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని అన్నారు. పట్టణాల్లో తాగునీరు సక్రమంగా విడుదల చేయలేక, విద్యుత్తు దీపాలు వెలిగించలేక అధికారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సమ్మెతో ప్రజలు కూడా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తాము అధికారానికి వస్తే సమస్యలు పరిష్కరిస్తామని హామీలు ఇచ్చి ఇంతవరకు పట్టించు కోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో పి ఆదాం, ఉసురుపాటి శ్యామ్యూల్, మారుతి, జాషువా కోటీశ్వరరావు, వెంకటేశ్వర్లు, రమేష్, మహిళా కార్మికులు పాల్గొన్నారు.

చీరాల : రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యల పట్ల దిగదుడుపు చర్యలు చేపట్టే విధంగా కార్మికుల సమస్యలు పరిష్కారం పేరుతో విడుదల చేసిన జిఒ 7 అసంతృప్తిగా ఉందని, తాత్కాలిక విజయమేనని, త్వరలో జిఒ 36 అమలు కోసం పోరాటాన్ని మళ్ళీ కొనసాగిస్తామని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ గౌరవ అధ్యక్షులు నలతోటి బాబురావు అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇంజనీరింగ్, పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కారం కోసం చేపట్టిన సమ్మె, దీక్షలు సోమవారం 8 రోజుకు చేరుకున్నాయి. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి పట్ల కార్మికులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ కార్మికుల జిల్లా కన్వీనర్ వీరస్వామి, కట్టా వెంకట్రావు, కాంతారావు, చాంద్ బాషా, గుంటగాని ఇమానియేల్, దుడ్డు శామ్యూల్, గేరా క్రాంతి సాగర్, మానికల శంకర్, కాంతారావు, అది లక్ష్మి, గూడూరు కోటేశ్వరమ్మ, ఏండ్లూరి సంధ్య, కుంబా నాగమణి, నూతలపాటి మరియమ్మ పాల్గొన్నారు.

రేపల్లె : ఇంజనీరింగ్ కార్మికులకు స్కిల్డ్ వేతనాలు అమలు చేయమంటే కేటగిరీలు వారీగా రూ.2వేలు లేదా రూ.3 వేలు పెంచుతామని, సమ్మె విరమించండని అనటం సమంజసం కాదని, స్కిల్డ్ వేతనాలు అమలు చేసేవరకు పోరాటం ఆగదని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్, ఇంజనీరింగ్ యూనియన్ అధ్యక్షులు డి ప్రభాకరరావు అన్నారు. కొన్ని స్వతంత్ర సంఘాలు, కొద్ది మంది కార్మికులు భయ భ్రాంతులకు గురై ఒప్పుకుంటున్నట్లు చెప్తున్నారని అన్నారు. సిఐటియు సమ్మె కొనసాగిస్తుందని తెలిపారు. ఇంజనీరింగ్ కార్మికుల సమ్మెకు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మద్దతు తెలిపారు. అంగన్వాడి యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె ఝాన్సీ, రేపల్లె కార్యదర్శి ఎస్ రవిబాబు, కోశాధికారి కె రాఘవేంద్రరావు, ఇంజనీరింగ్ వర్కర్స్ నాయకులు శివ, రవి, శ్రీను, సుబ్బారావు, సుధాకర్, వాసు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు చీరాల అధ్యక్షులు ఎన్ బాబురావు



రేపల్లెలో సమ్మెకు అంగన్వాడీ కార్యకర్తల మద్దతు



ఆర్డిఒకు వినతి పత్రం అందజేస్తున్న బాధితులు

గ్రీవెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - రేపల్లె

ప్రజా సమస్యల పరిష్కార వేదికను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డిఒ ఎన్ రామలక్ష్మి కోరారు. తన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం నిర్వహించి అర్జీలు స్వీకరించారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను సాధ్యమైనంత త్వరగా పరిష్కారం అయ్యే దిశగా కృషి చేస్తామని అన్నారు. అర్జీలను ఆయా శాఖల అధికారులకు పంపించినట్లు తెలిపారు. ప్రతి అర్జీకి త్వరితగతిన పరిష్కారం చూపవచ్చని అన్నారు.



బాధ్యతలు తీసుకున్న బెల్లంకొండ ఏడుకొండలు

సొసైటీ అధ్యక్షునిగా 'బెల్లంకొండ'

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని వెల్లచెరువు సొసైటీ అధ్యక్షులుగా సోమవారం బెల్లంకొండ ఏడుకొండలు ప్రమాణ స్వీకారం చేశారు. అడవిపాలెం గ్రామానికి చెందిన బెల్లంకొండ ఏడుకొండలు ఛైర్మన్‌గా, వెల్లచెరువుకు చెందిన కంచేటి భాస్కరరావు, కామేపల్లికి చెందిన గమిడి కోటేశ్వరరావు సభ్యులుగా సొసైటీ సీఈఓ రావెళ్ల ఆంజనేయులు ప్రమాణ స్వీకారం చేయించారు. సొసైటీ మాజీ అధ్యక్షులు చింతా శ్రీధర్ బాబు, అడ్డగడ శ్రీనివాసరావు, గుండుపనేని రామారావు, సొసైటీ బ్యాంకు సిబ్బంది అభినందనలు తెలిపారు.



మురళీకృష్ణను సత్కరిస్తున్న ప్రముఖులు

మురళీకృష్ణకు పౌర సత్కారం

ప్రజాశక్తి - పర్చూరు

పర్చూరుకు చెందిన మాజీ ఎపి సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు, సచివాలయంలో మున్సిపల్, అర్బన్ డెవలప్మెంట్ శాఖ అడిషనల్ సెక్రటరీగా పనిచేసి ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన ఉప్పుటూరి మురళీకృష్ణకు ఘనంగా పౌరసత్కారం చేశారు. అతని ఆత్మీయ మిత్రులు పౌర సత్కారాన్ని స్థానిక అద్దంకి నాంచారమ్మ కళ్యాణ మండపంలో నిర్వహించారు. సభకు కటారి సురేంద్ర అధ్యక్షత వహించారు. గ్రామంలో జరిగే అనేక అభివృద్ధి కార్యక్రమాలకు తన సహాయ, సహకారాలు అందించారని పేర్కొన్నారు. బంధు మిత్రులు, ప్రముఖులు, గ్రామస్తులు మురళీకృష్ణ, లక్ష్మీ దంపతులకు దుశ్శాలువాలు, పూలతో సత్కరించారు. డిప్యూటీ కలెక్టర్ కటారి రమేష్ నాయుడు, యరవిచంద్ర, నాటక న్యాయనిర్ణేత, రంగస్థల నటులు కారుమూరి సీతారామయ్య, కృష్ణంశెట్టి రామకోటేశ్వరరావు, కోట హరిప్రసాద్, డిఎస్ఒ ఉత్తమ శివరాం ప్రసాద్, రంగి శెట్టి ఆంజనేయులు, తులసి శివ నాగేశ్వరరావు, ఎం కోటేశ్వరరావు, బి రమణాచార్యులు, బి లక్ష్మీనాథ్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నివారణే లక్ష్యం

ప్రజాశక్తి - బాపట్ల

మాదక ద్రవ్యాలు పూర్తి స్థాయిలో నివారించడమే లక్ష్యంగా రైల్వే, సివిల్ పోలీసులు, ఈగల్ టీం సభ్యులు సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. స్థానిక రైల్వే స్టేషన్లో రైళ్లలో ప్రయాణికుల బ్యాగులు తనిఖీ చేశారు. బిలాస్ పూర్, తిరుపతి రైలులో ఆకస్మిక తనిఖీలు చేశారు. తనిఖీల్లో పట్టణ ఎస్ఐ విజయ్ కుమార్, ఆర్పిఎఫ్ సిఐ చంద్రశేఖర్, ఎస్ఐ మనోజ్ కుమార్, జిఆర్పి ఎస్ఐ సరస్వతి, డాగ్ స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పాలన



కరపత్రాలు అందజేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - సంతమాగులూరు

కూటమి ప్రభుత్వ పరిపాలనలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమం అందజేయడంలో ముందంజలో ఉన్నట్లు పుట్టావారిపాలెం సర్పంచి సన్నెబోయిన గురు యాదవ్ తెలిపారు. పుట్టావారిపాలెంలో సుపరి పాలన తొలి అడుగు ఇంటింటా టిడిపి కార్యక్రమం సోమవారం నిర్వహించారు. గ్రామంలోని వీధుల్లో టిడిపి నాయకులకు ఘన స్వాగతం పలికారు. ఏడాది పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం గురించి ప్రచురించిన కరపత్రాలు గ్రామస్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సన్నెబోయిన ఏడుకొండలు, మాదాల సుబ్బారావు, శివ, కొనికి శ్రీను, అద్దంకి వెంకటేశ్వర్లు, సింబోతుల వీరయ్య, షేక్ మాబు సైదా, వెంకట్ పాల్గొన్నారు.

అద్దంకి : మండలంలోని మణికేశ్వరంలో తెలుగుదేశం ఆధ్వర్యంలో ఐటీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ కరిముల్లా నేతృత్వంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ చొరవతో పాఠశాలల్లో మౌళిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ బడావలి, మీరావాలి, ఈసు, మౌలాలి, ఆదినారాయణ, మాధ్యూస్, సుధాకరరెడ్డి, రవి, మహేష్, రవీంద్ర, ప్రసాద్, అనీల్, తిమోతి, కాలేషా, శ్రీను, ఫకీర్, శివ, వెంకట్రావు, జాన్, యమాను పాల్గొన్నారు.



ఇంటింటికీ వెళ్లి టిడిపి అభివృద్ధిని వివరిస్తున్న నాయకులు



ఉపకరణాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ వెంకట్రామయ్య

పిల్లలకు ఉపకరణాలు పంపిణీ

ప్రజాశక్తి - పర్చూరు

విభిన్న ప్రతిభావంతులు, ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు స్థానిక భవిత భవన్‌లో ఎంఈఓ పి వెంకట్రామయ్య ఉపకరణాలను సోమవారం పంపిణీ చేశారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల పట్ల తల్లి, దండ్రులు నిర్లక్ష్యం వహించ వద్దని చెప్పారు. మండల కేంద్రమైన పర్చూరులోని భవిత భవన్‌కు తీసుకువచ్చి వారికి మంచి విద్యా బుద్దులు వచ్చే విధంగా చేసుకోవాలని సూచించారు. చిన్నారులకు మూడు చక్రాల సైకిళ్ళు, టిఎల్ఎం, రోట లాటర్ తదితర పరికరాలు పంపిణీ చేశారు. ఐఆర్టీలు గీతాంజలి, చంద్రిక, ఫిజియోథెరపీ డాక్టర్ విజయ గీతిక, ఎమ్మార్సీలు పాల్గొన్నారు.

సంపత్‌కుమార్‌కు కళా పురస్కారం

ప్రజాశక్తి అద్దంకి

పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మ ట్రస్టు నిర్వహించే విస్తృత కళాపురస్కారంకు తరంగాన నిష్ణాత శ్రీ ఘోరకవి శ్రీకృష్ణ సంపత్ కుమార్ ఎంపికయ్యారు. పురస్కారాన్ని ఆగస్టు 3న అందజే యనున్నట్లు శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. పివిఎస్ఆర్ ప్రసాదరావు 'శ్రీకృష్ణలీలా తరంగిణీ వైభవం' గురించి ప్రసంగిస్తారు. పురస్కారగ్రహీతకు రూ.10 వేలు, పట్టు బట్టలు, జ్ఞాపిక అందచేయనున్నట్లు తెలిపారు.

28 నుండి చిత్రలేఖనంపై శిక్షణ

ప్రజాశక్తి - అద్దంకి

ఎపి రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శిల్పం, చిత్ర లేఖనం నందు ఉచిత శిక్షణా తరగతులు ఈనెల 28 నుండి 31 వరకు నిర్వహిస్తున్నట్లు ఫౌండర్, ప్రెసిడెంట్ కత్తి బాల కోటేశ్వరరావు తెలిపారు. చిత్ర లేఖనంలో పాల్గొనే వారికి భోజన వసతులు, చార్జీలు, బొమ్మలు వేయుటకు రంగులు, బ్రష్ల ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం అవార్డులు, మెమెంటోలు, సర్టిఫికెట్స్ ఇవ్వనున్నట్లు తెలిపారు. వివరాలకు 79817 36648 నెంబర్లో సంప్రదించవచ్చని కోరారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న డాక్టర్ వి విజయవర్ధన్

వ్యాధులపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - పంగులూరు

విద్యార్థినిలకు హార్మోన్స్ వల్ల వచ్చే మార్పులు, వ్యాధుల గురించి ఉపాస హాస్పిటల్స్ ఎండోక్రైనాలజీ విభాగం వైద్యనిపు ణులు డాక్టర్ వి విజయవర్ధన్ వివరించారు. స్థానిక జెడ్పి ఉన్నత పాఠశాలలో 9, 10 తరగతి చదువు తున్న విద్యార్థినులకు ఉపాస్ హాస్పిటల్స్ సహకారం తో అవగాహన కల్పించారు. విద్యార్థినిలు తమకున్న సమస్యల గురించి అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం చెప్పారు. డాక్టర్ బి విజయవర్ధన్, హెచ్ఎం సోమేపల్లి శ్రీనివాసరావు, జడ్పిటిసి రాయిని ప్రమీల పాల్గొన్నారు.

హెపటైటిస్ బి, సి పరీక్షలు

ప్రజాశక్తి - అద్దంకి

అధిక సమస్యలు ఎదుర్కొంటున్న మహిళలు, పురుషులకు హెపటైటిస్ బి, సి పరీక్షలు నిర్వహించి వారిలో నెగిటివ్ వచ్చిన వారికి సోమవారం పట్టణంలోని పసుమర్తిపాలెంలో వ్యాక్సిన్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అనుమర్తిపాలెంలో ఎఎన్ఎం జె రాద్దమ్మ ఆధ్వర్యంలో వ్యాక్సిన్ కార్యక్రమం నిర్వహించారు. వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో హెల్ప్ పిఆ మల్లేశ్వరి పాల్గొన్నారు.

కేన్సర్ బాధితునికి సాయం

ప్రజాశక్తి - బాపట్ల

దీర్ఘకాలిక క్యాన్సర్ బాధితుడైన చీరాలకు చెందిన సాయి ప్రభాకర్ నెలకు సరిపడ మందులకు అయ్యే ఖర్చులకు సంబంధించి ఆర్థిక సహాయాన్ని బాపట్ల రెడ్ క్రాస్ బృందం కలెక్టరు ఆదేశాల మేరకు సోమవారం అందజేసినట్లు రెడ్ క్రాస్ చైర్మన్ బిఎస్ నారాయణ భట్టు తెలిపారు.


నీట మునిగిన ఇళ్లను పరిశీలిస్తున్న విఆర్‌ఒ కృష్ణవేణి

నీట మునిగిన పూరిళ్లు

ప్రజాశక్తి - వేటపాలెం

గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని దేశాయిపేట పంచాయతి నవజ్యోతి యానాది కాలనీలో 20పూరిళ్లు నీట మునిగాయి. వర్షపు నీళ్లు బయటకు పోయే మార్గం లేక నీటిలోనే జీవనం సాగిస్తున్నారు. పిల్లలతో ఇక్కట్లు ఎదుర్కొంటున్నామని కాలనీవాసులు మాజీ సర్పంచ్ నాసిక వీరభద్రయ్య దృష్టికి తీసుకు వెళ్లారు. ఆయన వెంటనే స్పందించి సమస్య తీవ్రతను ఎంపిడిఒ, తహశీల్దారుకు వివరించారు. స్పందించిన అధికారులు పంచాయతీ కార్యదర్శి టి వెంకటేశ్వరరావు, విఆర్‌ఒ కృష్ణవేణిని ఆ ప్రాంతాన్ని సందర్శించారు. వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తక్షణ సాయంగా బియ్యం, వంట సామాగ్రి, సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచి నాసిక వీరభద్రయ్య మాట్లాడుతూ నివేశ స్థలం ఉన్న అర్హులకు పక్క గృహాలు కట్టించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

గడ్డిమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

మండలంలోని తాటివారిపాలెంకు చెందిన తొట్టెంపూడి నరసింహారావు (40) గత కొద్ది రోజులుగా కుటుంబంలో జరుగుతున్న కలహాల నేపథ్యంలో టోల్ ప్లాజా సమీపంలో గడ్డిమందు త్రాగి ఆత్మహత్యకు పాల్పడ్డట్లు ఎస్ఐ షేక్ సైదా తెలిపారు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సిఐ శేషగిరిరావు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. పోస్ట్ మార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుని భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

మార్టూరు సమీపంలోని గొట్టిపాటి హనుమంతరావు కాలనీ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నాడనే సమాచారం రావడంతో వెళ్లి పరిశీలించినట్లు ఎస్ఐ షేక్ సైదా తెలిపారు. అక్కడి పొలాల్లో వ్యక్తి మృతి చెంది ఉండటాన్ని గుర్తించారు. మృత దేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి వివరాలు సేకరిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

ప్రజాశక్తి - మార్టూరు రూరల్


మృతురాలు మీరాబి

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి చెందిన ఘటన మార్టూరు సమీపంలోని బొబ్బేపల్లి ముస్లిం కాలనీలో సోమవారం వెలుగుచూసింది. పోలీసులు, మృతురాలి బంధువులు కథనం ప్రకారం పల్నాడు జిల్లా విప్పర్ల గ్రామానికి చెందిన మీరబికి మండలంలోని బొబ్బేపల్లికి చెందిన కరీముల్లాతో నాలుగు నెలల క్రితం వివాహం చేశారు. మద్యానికి బానిసైన కరీముల్లా వివాహం జరిగిన నాటి నుండి మీరాబిని వేధింపులకు గురిచేస్తున్నాడని బంధువులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో మీరాబీ ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉండటాన్ని స్థానికులు గమనించి పోలీసులు, మృతురాలి బంధువులకు సమాచారం ఇచ్చారు. ఘటన స్థలాన్ని సీఐ మాదినేని శేషగిరిరావు పరిశీలించారు. ఆమె మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆమె భర్త కరీముల్లాను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. మీరబిని హత్య చేసిన కరీముల్లాపై చర్యలు తీసుకోవాలని బంధువులు సీఐని వేడుకున్నారు. పోస్టు మార్టం నివేదిక అందిన తర్వాత నిందితునిపై చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.

మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి - వేటపాలెం


కొండయ్యకు స్వాగతం పలుకుతున్న నాయకులు

వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లుగా నియమితులైన నూతన పాలకవర్గంచే శాసన సభ్యులు మద్దులూరి మాల కొండయ్య సోమవారం ప్రమాణ స్వీకారం చేయించారు. మండలంలోని దేశాయిపేట పంచాయితీ నీలకంఠపురం నందు ఉన్న చీరాల వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం ఆవరణలో ప్రమాణ స్వీకారోత్సవ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండయ్య నూతన పాలకవర్గాన్ని ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం ఎఎంసి చైర్మన్ కౌతవరపు జనార్ధనరావు తోపాటు వైస్ చైర్మన్, డైరెక్టర్లను శాలువాలతో సన్మానించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఆప్కో చైర్మన్ సజ్జ హేమలత, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - చీరాల


సమస్యలు తెలుసుకుంటున్న చైర్మన్ ఎం సాంబశివరావు

పట్టణంలో చేపడుతున్న అభివృద్ధి పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు అన్నారు. పట్టణంలోని 1, 3వ వార్డుల్లో సోమవారం ఆయన మున్సిపల్ అధికారులతో కలిసి పర్యటించారు. ఆయా ప్రాంత ప్రజల సమస్యలు ఆయన దృష్టికి తీసుకు వచ్చారు. ఆ ప్రాంతంలో జరుగుతున్న అండర్ డ్రైనేజీ నిర్మాణం పనులు, అదే విధంగా 1వ వార్డులోని కమ్యూనిటీ హాలును పరిశీలించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వార్డుల్లో పారిశుధ్యం, డ్రైనేజీ పారుదల విషయంలో మునిసిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి వహించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని అన్నారు. వార్డుల్లో లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి నీటిని తొలగించాలని సూచించారు. డెంగ్యూ వంటి విషజ్వరాల బారిన పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఆయా ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లి దోమల నివారణకు ఫాగింగ్ చేయించాలని అన్నారు. ఆయన వెంట 3వ వార్డు కౌన్సిలర్ యానాది రావు, నాయకులు రత్నబాబు, సురేష్ పాల్గొన్నారు.

ట్రాక్టర్ దొంగిలించిన వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - కొల్లూరు

ట్రాక్టర్ చోరీకి పాల్పడిన ముద్దాయిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గుంటూరు పట్టాభిపురం షైవర్ వద్ద ముద్దాయి గోడల గోపీచంద్‌ను అరెస్టు చేసినట్లు ఎస్ఐ జానకి అమరవర్ధన్ తెలిపారు. ముద్దాయిని అదుపులోకి తీసుకుని విచారించగా దొంగిలించిన ట్రాక్టర్ కొల్లూరుకు చెందిన తేలిందని తెలిపారు. కొల్లూరుకు చెందిన సానా కొండయ్య ఈ నెల 11 రాత్రి 10 గంటల సమయంలో తన ట్రాక్టర్‌ను తెనాలి రోడ్డు లోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు వద్ద పార్క్ చేసి అరుణాచలం వెళ్లాడు. ఈ నెల 15న ఉదయం 6 గంటలకు తిరిగి వచ్చి చూసుకోగా రూ.3.80 లక్షల విలువైన తన ట్రాక్టర్ కనిపించక పోవడంతో పోలీసు స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ముద్దాయి ఈనెల 11న రాత్రి కొల్లూరు వచ్చి తిరిగి గుంటూరు వెళ్లే క్రమంలో ఏదైనా ట్రాక్టర్ దొంగతనం చేద్దామనుకుని ట్రాక్టర్ దొంగలించాడని ఒప్పుకున్నట్లు తెలిపారు. ముద్దాయి ఒప్పుకోవడంతో కేసు నమోదు చేసి తెనాలి కోర్టులో హాజరు పర్చినట్లు తెలిపారు.

సాంస్కృతిక వికాసం కాపాడుకోవాలి

ప్రజాశక్తి - బాపట్ల

సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో ఉభయ తెలుగు రాష్ట్రాలకే తలమానికమైన బాపట్ల సాంస్కృతిక రంగ పునర్వైభవానికి సమిష్టి కృషి జరగాలని రంగస్థల, చలనచిత్ర నటులు, దర్శకులు, ప్రయోక్త కెవిఎస్‌టి శాయి కోరారు. స్థానిక ఓ ప్రైవేటు వసతి గృహంలో జిల్లా రచయితల సంఘం నిర్వహించిన ఆత్మీయుల ఆంతరంగిక సమావేశానికి ఆయన హాజరయ్యారు. యువ కళాకారులకు శిక్షణ ఇచ్చేందుకు తాను ఎప్పుడూ సిద్ధంగా ఉంటానని అన్నారు. రచయిత తిమ్మన శ్యామ్ సుందర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కెవిఎస్‌టి శాయిని ఘనంగా సన్మానించారు. నందిరాజు విజయ్ కుమార్ పర్యవేక్షించిన కార్యక్రమంలో పెనుమెత్స నాగరాజు, గుండ్రెడ్డి సత్యనారాయణ, ఆకురాతి మురళీకృష్ణ, అంబటి మురళీకృష్ణ, శిష్ట్లా సీతారాం, కళ్ళం హరినాథరెడ్డి, చాపల సుబ్రహ్మణ్యం, బూర్గుల సంగమేశ్వర శాస్త్రి, జి శాంతారామ్, డబ్ల్యూఎజికె మూర్తి, షేక్ బాబావలి పాల్గొన్నారు.

పర్చూరులో 52.4 ఎంఎం వర్షపాతం

ప్రజాశక్తి - పర్చూరు

అల్పపీడన ప్రభావంతో ఆదివార సాయంత్రం 52.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు విఆర్‌ఒ వై శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. సోమవారం సాయంత్రం మేఘావృతమై ఈదురుగాలితో కూడిన వర్షం పడింది. వ్యవసాయానికి కూడా వర్షం ఎంత గానో ఉపయోగ పడుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పొలాలన్నీ దుక్కి దున్నిన రైతులు వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. ఇది ఇలా ఉంటే నల్లబర్లీ వేసిన పొగాకు రైతులు వాళ్ళ కష్టాలు చెప్పనలవి కావడం లేదు. ఈ వర్షాలతో తడిస్తే పాడవుతాయని, వాటిని కాపాడుకోలేక నానా తంటాలు పడుతున్నారు. పొగాకు నిల్వలు తడిసి పోకుండా కాపాడు కోవడం పెద్ద కష్టంగా మారింది.

పెరటి సాగుపై అవగాహన

ప్రజాశక్తి - భట్టిప్రోలు

బడిపిల్లలు పెరటి తోటల పెంపకంపై అవగాహన కలిగి ఉండాలని ఉద్యానవన శాఖ అధికారి జి కళ్యాణ్ చక్రవర్తి సూచించారు. స్థానిక టీఎం రావు ఉన్నత పాఠశాల్లో బట్టిప్రోలు ఫ్రెండ్స్ అసోసియేషన్, ఈసీ మెంబర్ మాచర్ల వెంకటేశ్వరరావు సౌజన్యంతో ఉద్యానవన, వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో పెరటి తోటలు ఎలా పెంచాలనే విషయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు హెచ్‌ఎం రామకోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో అధికారులు పెరటి తోటలు పండించు కోవచ్చని అన్నారు. ఎఇఒ లక్ష్మీ ప్రసన్న పెరటి మొక్కల పెంపకం ఆవశ్యకత వివరించారు. స్వయంగా పెంచు కోవడానికి కొంత స్థలాన్ని కేటాయించారు.


చెక్కులు పంపిణీ చేస్తున్న నరేంద్రవర్మ

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - బాపట్ల

సీఎం సహాయ నిధి చెక్కులను శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ అర్హులైన లబ్ధిదారులకు సోమవారం పంపిణీ చేశారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ స్థాయిలో అర్హులైన 27 మంది లబ్ధిదారులకు వైద్య ఖర్చుల కోసం రూ.19,46,083 విలువైన చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు పాల్గొన్నారు.


విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న గ్రెగోరి

నోటు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - చీరాల

మార్పు సంస్థ, హైదరాబాద్ హెల్పింగ్ సోసైటీ ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో ఈపూరుపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల్లో విద్యార్థులకు నోటు పుస్తకాలు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెల్పింగ్ సంస్థ ప్రతినిధి టి సుషీల్ మాట్లాడుతూ విద్యార్థుల అభివృద్ధికి చదువుతోపాటు ఆటలు కూడా కీలకపాత్ర వహిస్తాయని అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మి సిందూరి విద్యార్థుల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. రెవరెండ్ ఫాదర్ లాజర్ మాట్లాడుతూ విద్యను మనోహరంగా అభ్యసించగలిగితే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని ప్రోత్సహించారు. మార్పు సంస్థ సెక్రటరీ, కరస్పాండెంట్ మార్పు గ్రెగోరి మాట్లాడుతూ మార్పు సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ, ఇంగ్లీష్ కోచింగ్ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి హెచ్‌ఎం ఎం యశోద, ఉపాధ్యాయులు డి సుకన్య, ఎన్ శ్రీదేవి, కె చిరంజీవి, హెల్పింగ్ సంస్థ ప్రతినిధులు పి సుధీర్, ఎస్ మానస, బి ప్రవీణ్, కె సంజీవిని, మార్పు సంస్థ సిబ్బంది ఎస్ అశోక్, పి భాస్కర్, భాష పాల్గొన్నారు.

విద్యుత్ షాకుతో పాడిగేదె మృతి

ప్రజాశక్తి - అద్దంకి


మృతి చెందిన పాడి గేదె

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో పశు గ్రాసం కోసం వెళ్ళిన పాడిగేదె అక్కడికక్కడే మృత్యువాత పడిన ఘటన సోమవారం చిన్న కొత్తపల్లి గ్రామ సమీపంలోని పొలాల్లో జరిగింది. గ్రామానికి చెందిన రైతు మానం నరసింహారావు పశు గ్రాసం కోసం పాడి గేదెను పొలానికి వెళ్ళగా ఆ ప్రాంతంలో ట్రాన్స్‌ఫారం తెగులు మరింత తక్కువ ఎత్తులో ఉండటంతో ప్రమాదం జరిగింది. దీంతో పాడి రైతుకు రూ.90 వేలు నష్టం వాటిల్లిందని తెలిపారు. ఇటీవల విద్యుత్ షాకుతో మూడు పాడి గేదెలు మృతి చెందాయి. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వైర్లు అతి తక్కువ ఎత్తులో ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు, సిబ్బంది పట్టీ, పట్టనట్లు వ్యవహరిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. గతంలో రైతుల ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నాయి. ఇప్పుడు మూగజీవుల ప్రాణాలు పోతున్నా విద్యుత్ అధికారులు మొద్దు నిద్ర వీడటం లేదు. ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసిన ప్రాంతంలో రక్షణ కవచనం ఏర్పాటు చేస్తే ప్రమాదాలు సంభవించవని రైతులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఇటువంటి రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద రక్షణ కవచాలు ఏర్పాటు చేసి మనుషులు, పశువుల ప్రాణాలు కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

నిర్ణీత గడువు లోపు అర్జీల పరిష్కారం

కలెక్టర్ తమీమ్అన్సారియా


సమస్యలు వింటున్న కలెక్టర్ అన్సారియా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా స్వీకరించే అర్జీలకు అర్జీదారులు సంతప్తి చెందేలా నిర్దేశించిన గడువులోపు నాణ్యమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని మీకోసం సమావేశ హాలులో ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీల స్వీకరణ కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్అన్సారియాతో పాటు జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలక్రిష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి బి .చిన ఓబులేసు, ఎస్.డి.సీ లు వర కుమార్, శ్రీధర్ రెడ్డి, జాన్సన్, పార్ధసారధి, కుమార్ హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ తమీమ్అన్సారియా మాట్లాడుతూ, ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే అర్జీలను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి అర్జీదారులు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా నాణ్యమైన పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీ కోసం కార్యక్రమానికి సంబంధించి ఆన్లైన్లో వచ్చే అర్జీలను సంబంధిత శాఖల హెచ్.ఓ.డిలు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అర్జీదారులకు నిర్ణీత గడువు లోగా నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. రీ ఓపెన్ కేసులపై ప్రత్యేక దష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కౌలు కార్డులు ఇవ్వండి

కలెక్టర్‌కు కౌలు రైతు సంఘం నేతల వినతి


కలెక్టర్‌కు సమస్య వివరిస్తున్న సిహెచ్.గంగయ్య

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

కౌలు రైతులందరికీ కౌలు కార్డులు ఇవ్వాలని కోరుతూ కౌలు రైతు సంఘం నేతలు కలెక్టర్ జె.వెంకటమురళికి సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో వినతిపత్రం ఇచ్చారు. జిల్లాలో లక్ష కౌలు కార్డులు ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నట్లు గతంలో కలెక్టర్ ప్రకటించారని, కానీ ఆచరణలో జిల్లాలో సుమారు 2 వేలు మాత్రమే కౌలు కార్డులు ఇప్పటివరకు ఇచ్చారని, వ్యవసాయ భూముల్లో 70 శాతం పంట భూములను కౌలు రైతులు సాగు చేస్తున్నారనే విషయం అందరికీ తెలుసని తెలిపారు. కౌలు కార్డుల విషయంలో భూయజమాని ఆమోదం ఇవ్వనందువల్లనే కార్డుల మంజూరు కావడం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. యజమానితో సంబంధం లేకుండా వీఆర్వోలు విచారణ చేసి.. కౌలు కార్డులు ఇవ్వాలని కౌలు రైతు సంఘం నాయకులు కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కౌలు రైతు సంఘం ప్రకాశం జిల్లా కార్యదర్శి పి కొండయ్య, ఉపాధ్యక్షులు సిహెచ్.గంగయ్య ఉన్నారు.

ఆర్థిక సంఘం నిధులను

పంచాయతీ ఖాతాలో జమ చేయాలి

ఏపీ సర్పంచుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి కృష్ణమోహన్



నిరసన తెలుపుతున్న సర్పంచులు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

గ్రామ పంచాయతీలకు రావలసిన 15వ ఆర్థిక సంఘం నిధులను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ ఖాతాలో జమ చేయాలని ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి టి.కృష్ణమోహన్ డిమాండ్ చేశారు. సోమవారం ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద సర్పంచుల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1,121 కోట్లను తక్షణం విడుదల చెయ్యాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కలెక్టర్‌కి సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కార్యదర్శి కష్ణమోహన్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని జిల్లాల్లో ఉన్న సర్పంచ్‌ల న్యాయమైన డిమాండ్లను, రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నిధులు లేకుండా ఏ విధంగా గ్రామపంచాయతీలు అభివద్ధి చెందుతాయన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పంచాయతీలకు రావలసిన నిధులు వెంటనే విడుదల చేయని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన బాట పడతామని చెప్పారు. సర్పంచ్‌లు అందరం కలిసి రాజకీయాలకు అతీతంగా పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని సర్పంచుల సంక్షేమ సంఘం నాయకులు ఏ శ్రీనివాసరెడ్డి, మేకతోటి శ్రీకాంత్, బి అనిల్ కుమార్, మార్తమ్మ, డి అంకమ్మ, నాగార్జున రెడ్డి, కిషోర్ పాల్గొన్నారు.

ప్రజల ప్రాణాలతో

జగన్ అండ్ కో చెలగాటం

- లిక్కర్ స్కామ్‌లో దోషులెంతటి వారైనా చర్యలు తప్పవు
- ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్


మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యేలు దామచర్ల, బీఎన్‌లకు హారతులిస్తున్న మహిళలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

నాసిరకం మద్యం అమ్మకాల ద్వారా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడిన జగన్ అండ్ కో విషయంలో చట్టం తన పని తాను చేస్తుందని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. ఒంగోలులో సోమవారం జరిగిన 'సుపరిపాలనలో తొలి అడుగు' – 'ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం'లో ఒంగోలు, సంతనూతలపాడు శాసనసభ్యులు దామచర్ల జనార్ధనరావు, బిఎన్.విజయ్‌కుమార్ తో కలసి ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పాల్గొన్నారు. ఒంగోలు నగరంలోని 36వ డివిజన్‌లో ఇంటింటికీ వెళ్లిన మంత్రి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరును లబ్ధిదారులకు వివరించారు. అనంతరం మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో నాసిరకం మద్యంతో ప్రజలను మోసం చేసి, వారి ప్రాణాలు గాల్లో కలిసేలా చేశారని విమర్శించారు. డిజిటల్ చెల్లింపులు లేకుండా పెద్ద మొత్తంలో ప్రజా ధనాన్ని లూటీ చేశారని మండి పడ్డారు. లిక్కర్ స్కాం దోషులు ఎంతటి వారైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలకు నష్టం కలిగించిన బాధ్యులందరికీ తప్పకుండా శిక్ష పడుతుందని స్పష్టం చేశారు. లిక్కర్ స్కాం కేసులో సూత్రధారులు, పాత్రధారులు ఎవరూ కూడా తప్పించుకోలేరని చెప్పారు. అస్తవ్యస్తమైన విద్యుత్ శాఖను కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత గాడిలో పెడుతున్నామన్నారు. లో ఓల్టేజ్ సమస్యలను పరిష్కరించేందుకు రూ.6 వేల కోట్లతో పనులు చేపట్టినట్లు వివరించారు. వైసీపీ నేతలు విద్యా వ్యవస్థలోనూ రాజకీయాలకు పాల్పడి భ్రష్టు పట్టించారని ఆరోపించారు. విద్యార్థులకు ఇచ్చే బ్యాగులు, పుస్తకాలపై జగన్మోహన్ రెడ్డి బొమ్మలు వేస్తూ నాణ్యతలేని వస్తువులను పంపిణీ చేశారని మండిపడ్డారు. మంత్రి లోకేష్ విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేస్తున్నారని తెలిపారు. రాజకీయాలకు, నాయకులకు సంబంధం లేకుండా విద్యార్థులకు విద్యను మాత్రమే అందించే లక్ష్యంతో వారికి సామగ్రి అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, సంతనూతలపాడు ఎమ్మెల్యే బీ.ఎన్. విజయ్‌కుమార్, టిడిపి ఒంగోలు నగర అధ్యక్షులు బండారు మదన్, కార్యదర్శి బి వెంకట్, నాయకులు కొఠారి నాగేశ్వరరావు, కుసుమకుమారి, పసుపులేటి సునీత, తెలుగు మహిళ ఒంగోలు నగర అధ్యక్షురాలు పెద్దిశెట్టి వరలక్ష్మి, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కామ్రేడ్ అచ్యుతానందన్ మృతి తీరని లోటు

ప్రజాశక్తి-కనిగిరి

కేరళ మాజీ ముఖ్యమంత్రి అచ్యుతానందన్ అనారోగ్యంతో మృతిచెందిన నేపథ్యంలో కనిగిరి పట్టణంలోని సుందరయ్య భవనంలో సోమవారం నాడు సిపిఎం నాయకులు పట్టణ కార్యదర్శి పిసి కేశవరావు ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. అచ్యుతానందన్ చిత్రపటానికి పూలమాల వేసి.. నివాళులర్పించారు. 2006 నుంచి 2011 వరకు సీఎంగా కేరళ రాష్ట్ర ప్రజలకు ఆయన అందించిన సేవలను కొనియాడారు. సిపిఎం వ్యవస్థాపకుల్లో ఒకరైన అచ్యుతానంద్ మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. కార్యక్రమంలో నాయకులు నరేంద్ర, పాండు, చార్లెస్, లక్ష్మయ్య, ప్రసాద్, టోపీవలి, ఏడుకొండలు, పిచ్చయ్య పాల్గొన్నారు.

ఆక్రమిత వెంచర్‌పై నేడు పంచాయితీ..!

- రెవెన్యూ కోర్టుకు ఆధారాలతో హాజరు కావాలని... రియల్టర్ రవూఫ్‌కు అధికారుల నోటీసులు..!
- కలెక్టర్ ఆదేశాలలో కదిలిన యంత్రాంగం


అక్రమిత వెంచర్

ప్రజాశక్తి-మార్కాపురం

ఉన్నతాధికారులు మొట్టికాయలు వేస్తే గానీ కిందిస్థాయి రెవెన్యూ అధికారులు స్పందించడం లేదు. రూ.కోట్ల ఖరీదైన ప్రభుత్వ, ప్రయివేటు వ్యక్తుల భూములు అన్యాక్రాంతమవుతున్నా క్షేత్రస్థాయి అధికారులు చోద్యం చూస్తున్నారు. మార్కాపురం మండలంలోని పెద్ద నాగులవరంలో ఇటీవల అదే జరిగింది.

మార్కాపురం మండలంలోని పెద్దనాగులవరం ఇలాఖాలోని భూములు పట్టణ ప్రాంత వాసులకు సైతం నివాసాలకు యోగ్యంగా ఉన్నాయి. కూతవేటు దూరంలో ఉన్నందున ఇక్కడి భూమి ఎకరం రూ.కోట్లలో ధర పలుకుతోంది. పెద్ద నాగలవరం ఇలాఖాలోని సర్వే నెంబర్లు 153–1, 153–2, 153–3లలో ఎ॥6.36 సెంట్ల భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారులు కలిగి వున్నారు. ఆ భూమిని ఆనుకుని సర్వే నెంబర్లు 173–1ఎ, 173–2, 176–1లలో అసైన్‌మెంట్ భూమి కొంత, వాగుపోరంబోకు భూమి మరికొంత ఉంది. రియల్‌ఎస్టేట్ వ్యాపారులు పనిలో పనిగా ప్రభుత్వ భూములను కలిపేసుకున్నారు. ఆ వెంచర్ ఆనుకుని పెద్ద నాగులవరం గ్రామానికి చెందిన మల్లే మంగమ్మకు అనువంశికంగా సంక్రమించిన భూమి కూడా ఉంది. సర్వే నెంబర్ 153/3లో ఎ।7 0.20 సెంట్లు, మరో సర్వే నెంబర్ 154/1లో ఎ॥ 1.075 సెంట్లు భూమి ఉంది. ఈ భూమిని కూడా రియల్ ఎస్టేట్ వ్యాపారులు వదిలిపెట్టలేదు. మంగమ్మ అనుమతి లేకుండా ఆక్రమించారు. పెద్ద వెంచర్ వేశారు. అమ్మకాలు ప్రారంభించారు.

మల్లే మంగమ్మ మాత్రం చాలా కాలంగా రెవెన్యూ అధికారుల చుట్టూ న్యాయం కోసం తిరుగుతోంది. తనకు జీవనాధారమైన భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారుల కాజేశారని ఫిర్యాదులు ఎన్నోసార్లు చేసింది. గత నెల 9వ తేదీన స్పందనలో అర్జీ కూడా బాధితురాలు మంగమ్మ ఇవ్వడం జరిగింది. విషయం తెలిసిన తరువాత చర్యలు తీసుకోవడంలో జాప్యం జరిగింది. బాధితురాలి భూమి ఆక్రమణతో పాటు ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైన విషయంపై 'ప్రజాశక్తి' ఆరా తీసింది. ఈ నెల 18న 'రూ.5 కోట్ల ఖరీదైన భూమి కబ్జా' యత్నం శీర్షికతో ప్రజాశక్తి మినీలో కథనం వెలువడింది. దీనిపై ఉన్నతాధికారులు స్పందించారు. అదే రోజు తహశీల్దారు కె.చిరంజీవి, సర్వేయర్ సంజీవయ్య, విఆర్ఓ కళ్యాణిలతో పాటు ఇతర రెవెన్యూ సిబ్బంది ఆక్రమిత వెంచర్‌ను పరిశీలించారు. ప్రభుత్వ భూమి ఉన్నట్లు గుర్తించారు. అదే రోజు సాయంత్రం ప్రభుత్వ భూమిలో వేసిన వెంచర్‌ను తొలగించే చర్యలు చేపట్టారు.

ఈ నెల 19న మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామితో పాటు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా మార్కాపురంలో పర్యటించారు. ఈ సందర్భంగా రియల్లర్ల ఆక్రమణలో భూమిని కోల్పోయిన ధీనురాలు మంగమ్మ జిల్లా కలెక్టర్ అన్సారియాకు సమస్య వివరించారు. తనకు ఉన్న ఆధారం పోయిందని కంటతడి పెట్టారు. కలెక్టర్ అన్సారియా చలించిపోయారు. మంగమ్మను ఓదార్చడమే కాకుండా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా చొరవతో రెవెన్యూ అధికారుల్లో కదలిక వచ్చింది. బాధితురాలి మంగమ్మకు చెందిన భూమి ఆక్రమణపై రెవెన్యూ కోర్టు స్థానిక తహశీల్దారు కార్యాలయంలో ఈ నెల 22వ తేదీన (మంగళవారం) మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నారు. ఆక్రమణ ఆరోపణలు ఎదుర్కొంటున్న సయ్యద్ రవూఫ్ రెవెన్యూ కోర్టుకు తగిన ఆధారాలతో హాజరవ్వాలని నోటీసులు జారీ చేయడం గమనార్హం!